# రాజ్యము, నిబంధనలు మరియు పాత నిబంధన యొక్క ప్రామాణిక గ్రంథము

రెండవ పాఠము

## దేవుని రాజ్యము

THIRD MILLENNIUM MINISTRIES

బైబిల్ విద్య. లోకము కొరకు. ఉచితముగా.

వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

© 2012 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన, థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి., 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుంచి వ్రాతమూలకమైన అనుమతి పొందకుండా పునఃసమీక్షలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహాయిస్తే, పునఃర్ముద్రింపబడకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపింపబడిన థర్డ్ మిలీనియం పరిచర్యలు ఒక లాభాపేక్షలేని క్రైస్తవ వ్యవస్థగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను సమకూర్చు నిమిత్తము ప్రతిష్టింపబడింది. వర్తమాన కాలములో హితమైన, లేఖనానుసారమైన క్రైస్తవ నాయకత్వ శిక్షణ కొరకు ఇతోధికంగా అధికమవుతున్న విశ్వవ్యాప్త అవసరతకు ప్రతిస్పందనగా, మేము తేలికగా ఉపయోగించడానికి వీలైన, దాతల పోషణతో, బహుముఖ ప్రసార మాధ్యమముల ద్వారా ప్రయోగింపబడగల వేదపాఠ అధ్యయన శాల పాఠ్య క్రమమును ఐదు ప్రధాన భాషలలో (ఇంగ్లీష్, స్పానిష్, రష్యన్, మాండరిన్ చైనీస్, మరియు అరబిక్) సిద్ధం చేస్తున్నాము మరియు ఇది అత్యావశ్యకమైయున్నవారికి, ప్రాథమికంగా సంప్రదాయిక విద్యనభ్యసించడానికి అందుబాటులేని, లేదా ఆర్థికంగా భరించలేని క్రైస్తవ నాయకులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాము. పాఠములన్నియు రచింపబడినవి, రూపొందింపబడినవి, మరియు సంస్థలోపలే సిద్ధంచేయబడుతున్నవి, మరియు శైలి మరియు నాణ్యతలో హిస్టరీ ఛానల్©లో ప్రసారమగువాటి వలెనున్నవి. క్రైస్తవ నాయకులకు శిక్షణ నిచ్చుటకు ఈ అసమానమైన, ఖర్చుకు తగిన ఫలితమునిచ్చు పద్ధతి చాలా కార్యసార్థకమైనదై యున్నదని ప్రపంచమందంతటను రుజువయ్యింది. విద్య మరియు సజీవ వ్యంగ్య చిత్రముల ఉపయోగములో ప్రయోజనపడు విశిష్టమైన వీడియో చిత్రముల ఉత్పత్తి విషయంలో మేము టెల్లి అవార్డ్స్ గెలుచుకున్నాము, మరియు మా పాఠ్య క్రమము ప్రస్తుతము 192 కంటే ఎక్కువ దేశాలలో ప్రయోగింపబడుతుంది. థర్డ్ మిలీనియం పరిచర్యల యొక్క సాహిత్యం మొదలగు వస్తువులైన డీవీడీ, ముద్రణ, ఇంటర్నెట్, ఉపగ్రహ దూరదర్శిని ప్రసారములు, మరియు రేడియో మరియు దూరదర్శిని ప్రసారముల రూపంలో వాడబడుతున్నవి.

ఈ పరిచర్యలను గూర్చి మరియు మీరు మాతో కలసి ఎలా పరిచర్య చేయవచ్చునో తెలిసికొనగోరుచున్నట్లయితే, అదనపు సమాచారం కొరకు http://thirdmill.org ను సందర్శించండి.

# విషయ సూచిక

ఉపోద్ఘాతము........................................................................................ 1
విశాలమైన మరియు సంకుచితమైన................................................................ 2
మార్పులేని ........................................................................................ 2
అభివృద్ధి ......................................................................................... 3
ప్రాచీన చరిత్ర......................................................................................... 7
స్థలము ........................................................................................... 7
తొలి సిద్ధపాట్లు ................................................................................ 8
కొనసాగుచునేయున్న విస్తరింపు ........................................................... 10
ప్రజలు............................................................................................ 11
యాజకులు ...................................................................................... 12
ఉప ప్రతినిధులు ............................................................................... 13
పురోభివృద్ధి ....................................................................................... 15
విశ్వసంబంధమైన విద్రోహం ................................................................. 15
దుర్నీతి మరియు తీర్పు........................................................................ 16
దీర్ఘకాలిక వ్యూహము........................................................................ 17
ఇశ్రాయేలు జనాంగము............................................................................ 19
స్థలము ........................................................................................... 19
ఆరంభ కేంద్రం ................................................................................. 20
విస్తరింపు........................................................................................ 22
ప్రజలు............................................................................................ 23
ఇశ్రాయేలును ఏర్పరచుకొనుట............................................................... 23
యాజకుల రాజ్యము............................................................................ 24
యాజకులు మరియు రాజులు.................................................................. 25
పురోభివృద్ధి ....................................................................................... 25
వాగ్దానము ...................................................................................... 26
నిర్గమము మరియు విజయము................................................................. 27
సామ్రాజ్యము ................................................................................... 28
క్రొత్త నిబంధన......................................................................................... 32
స్థలము ........................................................................................... 32



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

కేంద్రము ........ 33
విస్తరింపు ........ 34
ప్రజలు ........ 0
క్రీస్తు ........ 36
విశ్వాసులు ........ 38
పురోభివృద్ధి ........ 39
ప్రారంభోత్సవము ........ 40
కొనసాగింపు ........ 40
లక్ష్యసిద్ధి ........ 41
ముగింపు ........ 41



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# రాజ్యము, నిబంధనలు మరియు పాత నిబంధన యొక్క ప్రామాణిక గ్రంథము

రెండవ పాఠము

దేవుని రాజ్యము

## ఉపోద్ఘాతము

వివరాలు చెబుతూ దారితప్పు ఒకరిని వర్ణించడానికి ఆంగ్ల భాషలో ఒక అభివ్యక్తీకరణమున్నది. ఇలాంటి వ్యక్తి "వృక్షాలన్నిటిని చూస్తున్నా, అడవిని చూడలేడు" అని తరచుగా చెప్తుంటాము. అలాగే, ఇదే విధమైన అభివ్యక్తీకరణములు అనేక సంస్కృతులలో ఉన్నాయి, కాబట్టి మనమిలా చెప్పినప్పుడు మన భావమేమైయున్నదో అర్థం చేసుకొనడం ఏమంత కష్టం కాదు. మన తలంపులలో అనేక వివరాలున్నప్పుడు, అల్పమైయున్న అంశాలలో దారితప్పిపోయి పెద్ద పెద్ద విషయాలలో, మరి ఎక్కువ ముఖ్యమైన విషయాలలో తికమక పడుతుంటాము. కాబట్టి, ఇలా తికమకపెట్టు పరిస్థితులలో, కొంచెమాగి, అసలు విషయమేమిటో ఆలోచించు అంటూ మనము తరచుగా ఒకరికొకరము గుర్తుచేస్తుంటాము.

చాలా మందికి, ఏదైన ఒక విషయమును గూర్చిన పూర్తి వివరాలు సులభంగా అర్థం కాకుండా ఉంటున్నాయంటే, అది పాత నిబంధన విషయంలోనే. పాత నిబంధన ఒక పెద్ద పుస్తకము, దానిలో అనేక పేర్లు, స్థలాలు, సంఘటనలు, వేదాంతశాస్త్ర సంబంధమైన బోధలు, మరియు నీతి సూక్తులు ఉన్నాయి, మరియు వీటి విషయంలో మనము పాత నిబంధనను ఏకీకృతము చేయు సంగతుల వెనుకనున్న దృష్టికోణాన్ని సులభంగా కోల్పోతుంటాము. ఈ విధంగా తికమకపెట్టు మరియు కొన్నిసార్లు దిగ్భ్రాంతి కలుగజేయు ఇట్టి అనుభవాలను అధిగమించవలెనంటే, మనము వెనుదిరిగి పాత నిబంధన యొక్క అసలు అంశమేమిటో అవగాహన చేసుకొనవలెను.

రాజ్యము, నిబంధనలు మరియు పాత నిబంధన యొక్క ప్రామాణిక గ్రంథము అనే శీర్షికన మనము పాత నిబంధనను గూర్చి చేయుచున్న అవలోకనము సంబంధమైన పాఠములలో ఇది రెండవ పాఠము. ఈ అంశముల వరుస క్రమములో మనము చూడబోతున్నట్టు, పాత నిబంధన దేవుని రాజ్యమును గూర్చిన పుస్తకమైయున్నది, మరియు అది దేవుని నిబంధనల చేత నిర్వహింపబడుతుంది మరియు ఇవన్నీ వివరింపబడుచు, ప్రామాణికమైన పాత నిబంధన పుస్తకముల ద్వారా నిర్దిష్టమైన పరిస్థితులకు అన్వయింపబడుచున్నవి. ఈ పాఠమునకు “దేవుని రాజ్యము” అను శీర్షిక పెట్టాము మరియు “రాజ్యము” లేదా దేవుని పరిపాలనను గూర్చిన బైబిలు యొక్క వేదాంతశాస్త్ర సంబంధమైన సరైన అవగాహన, మనకు పాత నిబంధనను గూర్చి ప్రాప్తించగల అత్యంత సమగ్రమైన మరియు ఏకీకృతము చేయు దృష్టికోణమును సమకూర్చుననే విషయాన్ని మనము ఈ పాఠంలో నేర్చుకుంటాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఈ పాఠంలో, మనము దేవుని రాజ్యమునకు సంబంధించి, బైబిలు సంబంధమైన బోధను గూర్చిన నాలుగు కోణాలను అన్వేషిస్తాము. మొదటిది, లేఖనాలు దేవుని రాజ్యమును గూర్చి విశాలమైన మరియు సంకుచితమైన అవగాహనల ప్రకారం ఏమని సెలవిస్తున్నాయో మనము చూస్తాము. రెండవది, ప్రాచీన యుగపు కాలములో, భూగ్రహ చరిత్ర యొక్క ఆది దశల కాలములో దేవుని రాజ్యము ఎలా ఉండిందో మనము తెలుసుకుంటాము. మూడవది, పాత నిబంధన ఇశ్రాయేలు యొక్క జాతీయ చరిత్ర విషయంలో దేవుని రాజ్యము ఎలా ఉండినదో మనము అన్వేషిస్తాము. ఇక నాలుగవది, దేవుని రాజ్యము క్రొత్త నిబంధనలో ఎలా కనబడుతున్నదో మనము తెలుసుకుంటాము. ఈ నాలుగు అంశాలను తెలుసుకొనడం ద్వారా మనము పాత నిబంధన అంతటిని గూర్చి విస్తృతమైన మరియు పొందికైన దృష్టికోణమును సంపాదించుకుంటాము. దేవుని ఏలుబడి గూర్చి పాత నిబంధన విశాలమైన మరియు సంకుచితమైన అవగాహనల ప్రకారం ఏమని తెలియజేయుచున్నదో మొదట చూద్దాము.

## విశాలమైన మరియు సంకుచితమైన

మన పాఠమును మొదలుపెట్టుచుండగా, దేవుని రాజ్యమును గూర్చి సరైన గ్రహింపు నిమిత్తమై నిరపేక్షంగా ఆవశ్యకమైయున్న రెండు దృష్టికోణాలను వివరించడానికి అది మనకు సహాయపడుతుంది. మొదటిది, విశాలమైన అవగాహన చొప్పున, దేవుని సార్వభౌమాధికారము సంపూర్ణమైనది మరియు అది మారనిదైయున్నదని పాత నిబంధన బోధిస్తుందనే విషయాన్ని మనము చూస్తాము. రెండవది, సంకుచితమైన అవగాహన చొప్పున, చరిత్రయందంతటను దేవుని రాజ్యము అభివృద్ధి చెందుచు ఎదుగుచున్నదనే విషయాన్ని మనము చూస్తాము. దేవుని నిరపేక్షముగా మారని సార్వభౌమాధికారము విషయంలో ఎక్కువ సాధారణమైనదైయున్న దృష్టికోణమును గూర్చి మొదట ఆలోచించుదాము.

### మార్పులేని

బైబిలును గూర్చి ఒక సువిదితమైన సుబోధ ఏదైనాగాని ఉన్నట్లయితే, అది ఇదే: తన సమస్త సృష్టికి దేవుడు సృష్టికర్త మరియు దానిని ఆదుకొనువాడునైయున్నాడు; మరొక సృష్టికర్తయైన దేవుడు లేనేలేడు. ఈ హేతువునుబట్టియే, దేవుడు ఎల్లప్పుడు తన సృష్టి అంతటిపై సుస్థిరమైన రాజ్యాధికారం కలిగియుండెను మరియు కలిగియుంటాడు. కీర్తనలు 93:1-2ను గమనించండి, అక్కడ రాజైన సృష్టికర్త యొక్క స్తుతిగానమును మనం వినవచ్చు:



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> యెహోవా రాజ్యము చేయుచున్నాడు, ప్రభావమును ఆయన వస్త్రముగా ధరించియున్నాడు యెహోవా బలముధరించి బలముతో నడుము కట్టుకొనియున్నాడు. కదలకుండునట్లు భూలోకము స్థిరపరచబడియున్నది. పురాతనకాలమునుండి నీ సింహాసనము స్థిరమాయెను సదాకాలము ఉన్నవాడవు నీవే (కీర్తనలు 93:1-2).

ఈ విధంగా, పాత నిబంధనలోని ఇశ్రాయేలు యొక్క విశ్వాసం దాని పొరుగువారి మతముల కంటే గొప్ప భిన్నత్వము గలదై యుండినది. సార్వభౌమాధికారం కోసం అనేకమంది దేవుళ్లు పోటీపడ్డారనియు, గనుక ఈ దేవుళ్ల శక్తి క్రమేపి క్షీణించిపోతూ చారిత్రక పరిస్థితుల ప్రకారం కొనసాగిందని పొరుగున ఉండిన మతములు సామాన్యంగా ఉపదేశించాయి. కొన్ని సందర్భాలలో, దేవుళ్లు సంవత్సరములోని కాలములు లేక ఋతువులు ఆవర్తనమగుచుండిన ప్రకారం లేచారు, పతనమయ్యారు. ఇతర సందర్భాలలో, వారికిష్టమైన దేశాలు పోరాటాలలో గెలుపోటములను అనుభవించుచుండిన దాని ప్రకారం దేవుళ్లు లేచారు మరియు పతనమయ్యారు.

కాని ఇటువంటి భావనలు బైబిలు సంబంధమైన విశ్వాసంలో భాగం కాదు. ఇశ్రాయేలు దేవుడైన యెహోవా సృష్టి యావత్తునకు, అనగా పరలోక సంబంధమైన జీవులకు లేదా “దేవుళ్లు” అని పిలువబడిన వారికి సహితం ఏకైన సృష్టికర్త, ఆదుకొనువాడు మరియు పరిపాలకుడునై యుండెను. ఈ అవగాహన చొప్పున, దేవుని సార్వభౌమత్వముగల రాజ్యాధికారము మారనిదైయున్నది. సృష్టి యావత్తు ఆయన రాజ్యమైయుండినది మరియు అయ్యుంటుంది.

దేవుడు సమస్త సృష్టిని ఎల్లప్పుడు ఏలుచుండెనని నమ్మడం ఒక సాధారణ అవగాహన చొప్పున ఎంత ప్రాముఖ్యమైయున్నదో, అలాగే దేవుని రాజ్యము అభివృద్ధి చెందుచుండినదని బైబిలు తెలియజెప్పు సంకుచితమైన రెండవ అవగాహనను కూడా మనము గుర్తించాలి.

## అభివృద్ధి

సంకుచితమైన ఈ అవగాహన చొప్పున, దేవుని రాజ్యం అభివృద్ధి చెందుతుంది, తిరోగమిస్తుంది, ముందుకు సాగుతుంది, మరియు చివరకు అది ప్రపంచమంతా వ్యాపించునంతగా ఎదుగుతుంది. మనము చూడబోతున్నట్టు, దేవుని రాజ్యాధికారము మరియు రాజ్యమును గూర్చి బైబిలు చెప్పునప్పుడు, సర్వసాధారణముగా ఈ చారిత్రక అవగాహన దాని మనస్సులో ఉంటుంది. ప్రభువు నేర్పినప్రార్థనలోని ప్రారంభ పలుకులను గమనించుట, దేవుని రాజ్యమును గూర్చిన ఈ దృష్టికోణాన్ని చూడటానికి అత్యంత అనుకూలమైన మార్గములలో ఒకటి. మత్తయి 6:9-10లో, తన శిష్యులు ఈ క్రింది విధంగా ప్రార్థించాలని వారికి నేర్పుతూ యేసు, దేవుని రాజ్యమును గూర్చిన పాత నిబంధన మొత్తం ఉపదేశాన్ని అందులో క్రోడీకరించాడు.

> పరలోకమందున్న మా తండ్రీ,
> నీ నామము పరిశుద్ధపరచబడునుగాక,
> నీ రాజ్యము వచ్చునుగాక,
> నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు
> భూమియందును నెరవేరును గాక (మత్తయి 6:9-10).

దేవుడు ఈ భూగ్రహమంతటితోపాటు సమస్త సృష్టిని ఎల్లప్పుడు ఏలుచున్నాడని మరి ఎక్కువ సాధారణమైన అవగాహన చొప్పున మనకు తెలుసు గనుక, మనము ఒక్కనిమిషమాగి ఆలోచించడానికి అది మనకొక అవకాశం కల్పించాలి. "నీ రాజ్యము వచ్చుగాక" అని యేసు మనకు నేర్పాడంటే, ఆయన అర్థమేమైయుంటుంది? ఇదివరకే ఇక్కడ ఉన్న విషయం, మరలా ఎలా "వస్తుంది?"

అది సరే, కాని, ఒక్క మాటలో చెప్పుకొంటే, దేవుడు చారిత్రక రాజ్యాధికారాన్ని అభివృద్ధి చేయుచున్నాడనే పాత నిబంధన బోధను యేసు సూచించాడు. దేవుని రాజ్యం ఈ లోకమునకు వచ్చి పరలోకాన్ని ప్రతిబింబించు విధంగా దానిని మార్చేస్తుందని ఆయన ఉపదేశించాడు. యేసు ఈ విషయాన్ని మత్తయి 6:9-10లో ఎలా అమర్చాడో మరొక పర్యాయం గమనించండి. ప్రాచీన హెబ్రీ కవిత్వము యొక్క వాడుకను ఉపయోగిస్తూ చూచినట్లయితే, రాజ్యమును గూర్చిన యేసు మాటలలో మూడు సమాంతర రేఖలున్నాయని తెలుస్తుంది. మొట్టమొదటిది, దేవుని నామము పరిశుద్ధంగా పాటింపబడవలెనని ఆయన చెప్పాడు. దీనిని విశదంగా విపులీకరిస్తూ, రాజ్యము వచ్చినప్పుడు దేవుని నామము పరిశుద్ధపరచబడుతుందని ఆయన వివరించాడు. రాజ్యము వచ్చుగాక అని పలుకడంలో ఆయన భావమేమైయుండినదో వివరించడానికి, రాజ్యము వచ్చుగాక అనేది దేవుని చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్టు భూమియందును నెరవేరుటయని యేసు చెప్పాడు.

దేవుని నామము ఎల్లప్పుడు అన్నిచోట్ల పరిశుద్ధపరచబడునట్లు, ఈ భూలోకం పరలోకము వంటిదగునంత విస్తృతంగా దేవుడు తన రాజ్యాన్ని ఈ లోకానికి తెచ్చునట్లు మనము ప్రార్థించాలని యేసు మనకు నేర్పించాడు. దేవుడు ఇదివరకే ఈ భూలోకమంతటిని తన ఆధీనంలో ఉంచుకున్నాడనే విషయం యేసుకు తెలుసు, కాని అది పరలోకము యొక్క ఆశ్చర్యమును ప్రతిబింబించునట్లు దేవుడు ఒకానొక దినాన ఈ భూగ్రహాన్ని విమోచించి, వినూత్నపరచి, పరిపూర్ణం చేస్తాడని పాత నిబంధన వాగ్దానం చేసిందనే విషయం కూడా ఆయనకు తెలుసు. గనుక ఇట్టి అవగాహన చొప్పున దేవుని రాజ్యము ఆయన కాలములో ఈ లోకంలోనికి రావాలని యేసు కోరాడు. యేసునకు సంబంధించినంత మేరకు, ఈ భూగ్రహంపై, ఈ భూమికి ఏదో ఒకటి సంభవించాల్సి ఉండినది. ఆయన చిత్తం భూమియందును నెరవేరునట్లు దేవుడు తన పరలోక సంబంధమైన పరిపాలనను విస్తరించాల్సి ఉండినది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

దేవుని చిత్తం పరలోకమందు వలె భూమియందును ఎలా నెరవేర్చబడగలదో అర్థం చేసుకోడానికి దానియేలు 7వ అధ్యాయంలోగల దేవుని పరలోక సంబంధమైన పరిపాలనను గూర్చిన రూపచిత్రాన్ని మనము చూద్దాము. దానియేలు 7:9-10 వచనాలలో ఇలా వ్రాయబడియున్నది:

> ఇంక సింహాసనములను వేయుట చూచితిని; మహా వృద్ధుడొకడు కూర్చుండెను. ఆయన వస్త్రము హిమము వలె ధవళముగాను, ఆయన తలవెండ్రుకలు శుద్ధమైన గొఱ్ఱెబొచ్చువలె తెల్లగాను ఉండెను. ఆయన సింహాసనము అగ్నిజ్వాలలవలె మండుచుండెను; దాని చక్ర ములు అగ్నివలె ఉండెను. అగ్నివంటి ప్రవాహము ఆయనయొద్దనుండి ప్రవహించుచుండెను. వేవేలకొలది ఆయనకు పరిచారకులుండిరి; కోట్లకొలది మనుష్యులు ఆయనయెదుట నిలిచిరి, తీర్పుతీర్చుటకై గ్రంథములు తెరువబడెను (దానియేలు 7:9-10).

పరలోకమును గూర్చిన ఈ రూపచిత్రము అసాధారణమైనది కాదు. అది దేవుని పరలోక సింహాసనమును గూర్చి లేఖనము మాటలాడు ప్రతిసారి మనము కనుగొనునటువంటి దృశ్యమైయున్నది. కాని మనము చూడవలసిన దివ్యమైన పాలనను గూర్చిన ఈ రూపచిత్రానికి కనీసం రెండు కోణాలున్నాయి.

ఒక ప్రక్క, దేవుడు పరలోకమందు పరిపాలిస్తూ తననుతానే తన సృష్టిజాలమునకు తన ప్రత్యేకమైన, మహిమాన్వితమైన ఉనికిలో బయలుపరుస్తున్నాడు. లేఖనములో ఉపదేశిస్తున్నట్టుగా, దేవుడు సర్వవ్యాపి; ఆయన అంతటా ఉన్నాడు — కాని ఆయన తన సర్వవ్యాపకమునుబట్టి మన కంటికి కనబడడు. ఏదేమైనా, పరలోకమందు సింహాసనమున్న చోట, దేవుడు సింహాసనాసీనుడై, హిమము వలె ధవళముగా నుండు వస్త్రములు ధరించియున్నాడు, ఆయన తలవెండ్రుకలు గొర్రెబొచ్చువలె తెల్లగా ఉన్నవి. ఆయన సింహాసనము అగ్నిజ్వాలలవలె మండుచున్నది మరియు అగ్నివంటి ప్రవాహము ఆయన సింహాసనము యొద్ద నుండి ప్రవహిస్తుంది. ఆయన సింహాసనమున్న చోట దేవుని ప్రత్యేకమైన సన్నిధి మహత్వపూర్ణమైనదైయున్నది; ఆయన సమస్త మహిమగలవాడుగా కనబడును; కన్నులు కానలేని ఆయన శోభ పరలోకమును నింపుతుంది.

పరలోకమందలి సింహాసనమున్న స్థలములోని దేవుని మహిమను భూమి మీదనున్న దేవుని మహిమతో పోల్చి చూడుము. మహా అయితే, మనము భూమి మీద చూచేది మహత్వపూర్ణమైన ఆయన పరలోక దేదివ్యమానము యొక్క నిస్తేజమైన ప్రతిబింబమైయున్నది. అవును, సృష్టిలోని ఆశ్చర్యకార్యములలో ప్రతిబింబింపబడు దేవుని మహిమను మనము చూస్తుంటాము కాని పరలోకమందున్న దేవుని మహిమతో ఏదియు పోల్చబడజాలదు. కాబట్టి, దేవుని ఏలుబడి భూమి మీదకు పరలోకమందువలె రావలెనని యేసు ప్రార్థించినప్పుడు, దేవుని ప్రత్యేక సన్నిధి యొక్క మహత్తైన ప్రతిభ పరలోకమును నింపుచున్నట్టుగానే ఈ భూమిని నింపాలనేది ఆయన మనస్సులో ఉండిన ఒక కోరికైయున్నది.

**అపొస్తలుడైన యోహాను క్రీస్తు తిరిగి వచ్చునప్పుడు పరలోకము నుండి భూలోకమునకు వచ్చు నూతన యెరూషలేమును వర్ణించినప్పుడు అతని మనస్సులో ఉండిన విషయమిది. ప్రకటన 21:23లో మనము ఈ విధంగా చదువుతాము:**

> ఆ పట్టణములో ప్రకాశించుటకై సూర్యుడైనను చంద్రుడైనను దానికక్కరలేదు; దేవుని మహిమయే దానిలో ప్రకాశించుచున్నది. గొఱ్ఱపిల్లయే దానికి దీపము (ప్రకటన 21:23).

**కాబట్టి, దేవుని రాజ్యము పరలోకమందు వ్యక్తము చేయబడినట్టుగానే భూమియందును వ్యక్తముచేయబడవలెనని మనము ప్రార్థించాలని యేసు మనకు నేర్పించినప్పుడు, దేవుడు తన మహిమాన్వితమైన, రాచరిక వైభవంతో ఈ భూమి మీదికి రావాలని మనము అడగాలనేది ఆయన పాక్షిక భావమైయున్నది.**

**మరొక ప్రక్క దేవుని మహత్తైన, మహిమాన్వితమైన సన్నిధి, పరలోక సింహాసనమందు కొన్ని పరిణామములు కలుగుటకు కారణమవ్వాలని కూడా మనము గమనించుకోవాలి. దానియేలు 7:10లో మనమిలా చదువుతున్నాము:**

> వేవేల కొలది ఆయనకు పరిచారకులుండిరి. కోట్లకొలది మనుష్యులు ఆయన యెదుట నిలిచిరి (దానియేలు 7:10).

**అసంఖ్యాకమైన జీవులు దేవుని సింహాసనము యెదుట నిలిచియుండి ఆయనను ఆరాధించుచు, వినయముతో ఆయన చెప్పినట్టు చేయుచుండిరి.**

**దేవుని దేదీవ్యమానమైన సన్నిధి యొక్క పర్యవసానం దేవుని రాజ్యము భూమి మీదికి రావడం వలన కలిగిన రెండవ ఫలితమైయున్నది. భూమి మీద, ఈ సమయంలో దేవునికి విరోధంగా తిరిగిబాటు చేయడం సులభం. వాస్తవానికి, జీవులలో అధిక సంఖ్యాకులు చేసేది ఇదే. ఆత్మసంబంధమైన మరియు మానవీయమైన దేవుని శత్రువులు అయన ఏలుబడిని వ్యతిరేకిస్తున్నారు. కాని ఒకానొక దినాన, క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు మరియు ప్రత్యేకమైన మహిమాన్వితమైన దేవుని సన్నిధి నూతన భూమి మీదికి వచ్చినప్పుడు, భూమి మీదనున్న సకల ప్రాణులు నాశనమవుతారు లేదా వారు ఇచ్చట ఆయన చిత్తమును ఇప్పుడది పరలోకమందు నెరవేరుచున్నట్టు నెరవేరుస్తారు. ఈ హేతువునుబట్టియే అపొస్తలుడైన పౌలు ఫిలిప్పీ 2:10లో పలికినట్టుగా పలుకగలుగుతున్నాడు:**

> పరలోకమందున్నవారిలో గాని, భూమి మీద ఉన్నవారిలో గాని, . . . ప్రతివాని మోకాలును యేసు నామమున వంగును (ఫిలిప్పీ 2:10).



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

కాబట్టి యేసు, దేవుని రాజ్యము అభివృద్ధి చెందుచున్నదానిగాను, చారిత్రకమైనదానిగాను, భూసంబంధమైన వాస్తవికతగాను ప్రకటించాడని మనము గమనిస్తున్నాము. దేవుని చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్టు భూమి మీదను విస్తృతంగా నెరవేరునప్పుడు భూమి మీద ఆయన యొక్క ప్రత్యేక సన్నిధిలో దేవుని మహిమ ఎంతో విదితంగా కనబడు ఆ దినము కోసం ఆయన కోరాడు. ఆ భవిష్య దర్శనమును మనము ఆయనతో పంచుకొనవలెనని ఆయన మనకు నేర్పిస్తున్నాడు.

దేవుని పరిపాలనను మనము దాని విశాల అవగాహన మరియు సంకుచితమైన అవగాహన చొప్పున నుండు భేదాలను గమనించాము గనుక, దేవుని రాజ్యము యొక్క భూమి యందలి అభివృద్ధి జాడలో పాత నిబంధన దాని ఐక్యతను ఎలా కనుగొంటుందో చూడగలిగేంతటి సమర్థవంతులమై యున్నాము. ఇప్పుడు, ప్రాచీన చరిత్ర అని తరచుగా ప్రస్తావింపబడుచుండు ఆదికాండము 1:1-11:9లో పేర్కొనబడిన దేవుని రాజ్యమును మనము చూద్దాము.

## ప్రాచీన చరిత్ర

మనము ప్రాచీన చరిత్రను పరిశీలనగా పరిశోధిస్తూ, ముఖ్యంగా మూడు విషయాలను చూద్దాము: మొదటిదిగా, బైబిలులోని ఈ భాగం భూమి మీద దేవుని రాజ్యమును గూర్చిన స్థలాన్ని ఎలా నిర్వచిస్తుంది; రెండవదిగా, అది దేవుని రాజ్యములోని ప్రజలను ఎలా నిర్వచిస్తుంది; మరియు మూడవదిగా, అది దేవుడు భూసంబంధమైన రాజ్యము యొక్క ఆదిమ పురోభివృద్ధిని ఎలా వర్ణిస్తుంది. మొట్టమొదట, దేవుని రాజ్యమును గూర్చిన స్థలమును ప్రాచీన చరిత్ర ఎలా స్థిరపరుస్తుందో చూద్దాము.

### స్థలము

భూమిని ఆయన రాజ్యము యొక్క స్థలముగా స్థిరపరచడానికి దేవుడు మొదట ఎలా ఆరంభించాడో ఆదికాండములోని ప్రారంభ అధ్యాయాలు వివరిస్తున్నాయి. దేవుని మహిమాన్వితమైన ఏలుబడి గూర్చిన భూగోళ సంబంధమైన ఈ పరిమాణము రెండు అంచెలలో ఎలా బయలుపరచబడిందో మనము చూద్దాము. మొదటిదిగా, దేవుడు రాజైయుండిన ఆయన పరిపాలన కొరకు భూమిని మొదటి నుండి సిద్ధపరచాడనే విషయాన్ని మనము తెలుసుకుంటాము. రెండవదిగా, దేవుడు తన ఏలుబడిని ఒక కేంద్ర స్థానంలో ఎలా మొదలుపెట్టాలో, మొదలుపెట్టినదాని భూగోళ సంబంధమైన సరిహద్దులలో ఈ లోకమంతటిని కలుపుకోడానికి దానిని ఎలా విస్తరింపజేయాలో అని రచించిన ప్రణాళికను గూర్చి మనము నేర్చుకుంటాము. దేవుడు ఆయన రాజ్యమును కట్టుట కొరకు లోకమును ఆరంభములో సిద్ధం చేసిన విధానములతో మొదలుపెడదాము, రండి.

## తొలి సిద్ధపాట్లు

ఆదికాండము యొక్క మొదటి అధ్యాయం, దాని దృష్టిని ఈ లోకం ఆయన రాజ్యమగునట్లు దేవుడు దానిని మొదట సిద్ధంచేసిన విధానముపై కేంద్రీకరిస్తుంది. ఈ అధ్యాయం యొక్క శీర్షిక ఆదికాండము 1వ అధ్యాయం 1వ వచనములో కనిపిస్తుంది.

> ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను (ఆది. 1:1).

ఈ శీర్షిక తరువాత, ఆది. 1:2-2:3 వరకు, దేవుడు భూమిని ఆయన మహిమాన్వితమైన ఏలుబడి నిమిత్తమైన ఒక మూడింతల నిర్మాణమున్న స్థలంగా రూపొందించడమును వెంటనే మొదలుపెట్టాడని వ్రాయబడియున్నది.

మొదటిదిగా, సృష్టిని గూర్చిన కథ ఆది. 1:2లో ఆరంభమవుతుంది, అప్పుడు లోకం అస్తవ్యస్తంగా ఉండినది గనుక ఇట్టి అస్తవ్యస్తమైన పరిస్థితిని చక్కబరచడానికి దేవుడు సిద్ధపడుచుండెననియు తెలుస్తుంది. ఈ వచనంలో భూమి వర్ణింపబడిన విధానాన్ని గమనించండి:

> భూమి నిరాకారముగాను శూన్యముగాను ఉండెను, చీకటి అగాధ జలముపైన కమ్మియుండెను, దేవుని ఆత్మ జలములపైన అల్లాడుచుండెను (ఆది. 1:2).

ఈ వచనంలో రెండు ముఖ్యమైన విషయాలు చెప్పబడియున్నవి. ఒక ప్రక్క భూమి "నిరాకారముగాను, శూన్యముగాను," చీకటి కమ్ముకొని యుండెను, అగాధం అస్తవ్యస్తమైనదై యుండెను. ఈ సమయంలో, భూమి మానవుడు నివసించడానికి ఆహ్లాదకరమైన స్థలము కాదు; అది ఆదర్శవంతమైనది కాదు. "నిరాకారము మరియు శూన్యము" అనే పదములు భూమి మీద ఉండిన ఆటవికమైన అరణ్య ప్రదేశములను, మానవులు నివసించడానికి యోగ్యంకాని స్థలాలను సూచించడానికి పాత నిబంధనలో మరొకచోట ప్రయోగింపబడినవి. దీనికి తోడుగా, "చీకటి" మరియు "అగాధము" అనే పదములు లేఖనముల యందంతటను చాలా వ్యతిరేకార్థకమైన సహజార్థములుగలవైయున్నవి. ప్రారంభములోనే, భూమి విరోధమైనది మరియు జీవములేనిదియునై యుండెను.

కాని మరొక ప్రక్క భూమి యొక్క చరిత్ర ఆరంభమును గూర్చిన అగత్యమైన వాస్తవమును మనకు 2వ వచనం తెలియజేస్తుంది — "దేవుని ఆత్మ జలముల పైన అల్లాడుచుండెను." అస్తవ్యస్తమైయున్న దాని తొలి పరిస్థితినిబట్టి భూమిని విడిచిపెట్టడానికి వెలుగు మరియు జీవమైయున్న దేవుడు తృప్తిచెందలేదు. అంధకారమయమై యుండి జీవములేనిదైన సృష్టికి విరోధంగా కార్యము చేయుటకు ఆయన పూనుకున్నాడు.

ఆది. 1:3-31లోని వివరము ఆదేశములు జారీచేయబడిన ఆరు దినముల సృష్టి క్రమములోని రెండవ భాగమైయున్నది. భూమి ఆయన రాజ్యమగునట్లు దేవుడు లోకమును ఎలా సంసిద్ధం చేశాడో ఈ వచనములు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

వివరిస్తున్నాయి. దేవుడు తన సృష్టిని రూపొందించిన విధానములోగల జ్ఞానమును మరియు ఉద్దేశాలను ప్రదర్శించు వివేచింపబడగల నమూనాను ఈ ఆరు దినములు ప్రదర్శిస్తున్నాయని అనేక మంది అనువాదకులు సూచించారు.

మొదటి మూడు దినములలో దేవుడు భూమి నిరాకారముగా ఉండినదను విషయాన్ని సరిచేశాడు. తరువాత మూడు దినములలో ఆయన భూమి శూన్యముగా ఉన్నదనే వాస్తవంతో వ్యవహరించాడు. అంతమాత్రమేగాక, మూడేసి చొప్పున గల ఈ రెండింటిలోను ఆయన చేపట్టిన చర్యలు ఒకదానితో మరొకటి కొన్ని చెప్పుకోదగిన విధానాలలో సమాంతరమైనవై ఉన్నాయి. మొదటి దినాన దేవుడు పగలును చేసి, చీకటిని రాత్రికి పరిమితం చేశాడు. దీనికి అనుగుణ్యంగా, నాలుగవ దినాన ఆయన సూర్య చంద్ర నక్షత్రాదులను ఈ క్రమమును నిర్వహించడానికి ఆకాశంలో వాటి స్థానాలలో ఉంచాడు. రెండవ దినాన దేవుడు వాతావరణమును సృజించాడు; జలముల మధ్య ఒక విశాలమునేర్పరచి క్రింది నీటిపై నీళ్ల నుండి వేరుచేశాడు. ఐదవ దినాన, జలముల మధ్య ఉండిన స్థలమును నింపడానికి ఆకాశపక్షులను, క్రింద ఉండిన నీటిని నింపడానికి దేవుడు జలచరములను సృజించాడు. మూడవ దినాన దేవుడు ఆకాశము క్రింద నున్న జలములు ఒక్క చోటనే కూర్చబడి ఆరిన, సారవంతమైన నేల కనబడునట్లు చేశాడు. ఆరవ దినాన, దేవుడు భూమిని నింపించడానికి భూమి మీద నుండు జంతువులను మరియు మానవ జాతిని సృజించాడు. అస్తవ్యస్తంగా ఉండిన పరిస్థితిని ఆశ్చర్యకరముగా సక్రమములో నుండిన చోటు కావలెనని పలుకుచు, దానిని మార్పునొందిస్తూ, దేవుడు చెప్పశక్యముకాని తన జ్ఞానమును మరియు అధికారమును ప్రదర్శించాడు.

ఇక మనము 3-31 వరకు గల వచనాలలో పునరావృత్తం చేయబడిన ప్రధానాంశమును గూర్చి ప్రత్యేక శ్రద్ధను వహించాలి. మరి నిర్దిష్టంగా, ఆయన సృజించిన సమస్త సృష్టిని దేవుడు చూచినప్పుడు, అది మంచిదిగా పరిగణించాడని ఆదికాండము 1వ అధ్యాయం మనకు తెలియజేస్తుంది. 31వ వచనంలో, ఆరవ దినాన దేవుడు తాను సృజించిన దానిని చూచి అది చాలామంచిదిగా ఉండినట్టు చూశాడనే విషయాన్ని మనము గమనిస్తాము.

సృష్టి మంచిదై యుండెనని బైబిలు సెలవిస్తున్నప్పుడు, దేవుడు అస్తవ్యస్తంగా ఉండిన పరిస్థితిని, చీకటిని మరియు అగాధమును, ఆయన గణనీయంగా చక్కదిద్ది లోకమును ఒక క్రమంలో పెట్టాడు కాబట్టి ఆయన చేసిన కార్యములను నైతిక అవగాహన చొప్పున ఆమోదించాడనేదికొంత మేరకు దాని అర్థమైయున్నది. కాని "మంచిది" అని అనువదింపబడిన పదము, హెబ్రీ భాషలో *tov (טוב)*, అంతకు మించిన అర్థాన్ని కూడా ఇస్తుంది. ఇక్కడ మరియు పాత నిబంధనలోని ఇతర చోట్ల, ఈ పదము "ఆహ్లాదకరమైన" "ఆనందమును కలుగజేయు" మరియు "అందమైన" అనే అర్థాన్ని కూడా ఇస్తుంది. ఆరు దినములలో, దానిని ఆయనకు ఆనందాన్ని కలుగజేసే ఒక అందమైన చోటుగా చేస్తూ అది ఆయన సొంత చిత్తమును మరియు కోరికలను వెల్లడిపరచునట్లు దేవుడు ఈ విశాల విశ్వమంతటిని మార్చివేశాడు.

ఈ హేతువునుబట్టి సృష్టి వృత్తాంతమును గూర్చి ఆది. 2:1-3లో గల మూడవ భాగం సబ్బాతును గూర్చి చెప్పుతుంది. ఆదికాండము 1వ అధ్యాయం ఆరంభంలో దేవుడు సృష్టి విషయం తానాశించినంతగా తృప్తిచెందలేదు. కాని ఆది. 2:1-3లో దేవుడు ఆయన చేసిన సృష్టి విషయమై ఆనందించాడు. వాస్తవానికి, భూమిని గూర్చిన ఆదిమమైన ఏర్పాటుతో దేవుడు ఎంతో ఆనందించాడు గనుక ఆయన ఈ పనంతటి నుండి విశ్రమించి ఆ దినమును ఏడవ దినముగా లేదా సబ్బాతు దినముగా పరిశుద్ధపరచాడు. ఒక్క మాటలో చెప్పుకొంటే, ఆయన చేపట్టిన మొట్టమొదటి ఏర్పాట్లు భూమి ఎటువంటి స్థలమైయుండవలెనని ఆయన ఆశించాడో ఆ విధంగా ఉన్నాయని దేవుడు తృప్తిచెందాడు.

మనము ఇదివరకే తెలుసుకొన్నట్టుగా, భూమి ఆయనకు ఆనందమును కలుగజేయు స్థలమైయుండునట్లు దేవుడు దానిని ఆదియందు సిద్ధపరచాడు, కాని భూమి విషయమై దేవుని మనస్సులో ఉండిన గంభీరమైన ఉద్దేశముల నిమిత్తము అది మరి ఎక్కువగా అభివృద్ధి చేయబడవలసి ఉండినదనే విషయాన్ని కూడా మనము గమనించవలసియున్నది.

## కొనసాగుచునేయున్న విస్తరింపు

దేవుడు సృష్టి క్రమములోని మొదటి వారం రోజులలో ఆయన చేయదలచిన దానంతటిని చేసినప్పటికిని, ఆయన ఈ లోకమంతటిని ఆశ్చర్యకరమైన పరదైసుగా మార్చలేదు. కొంత మేరకు లోకమంతయు క్రమపరచబడి యుండగా, పరదైసు అని పిలువబడే స్థలం భూమి మీద వాస్తవంగా ఒకే ఒక్క స్థలం ఉండినదనే విషయం వైపు ఆదికాండము 2వ అధ్యాయం మన దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ స్థలమును గూర్చి ఆది. 2:8-9 వర్ణిస్తున్న తీరును గమనించండి.

> దేవుడైన యెహోవా తూర్పున ఏదెనులో ఒక తోటవేసి తాను నిర్మించిన నరుని దానిలో ఉంచెను. మరియు దేవుడైన యెహోవా చూపు నకు రమ్యమైనదియు ఆహారమునకు మంచిదియునైన ప్రతి వృక్షమును, ఆ తోటమధ్యను జీవవృక్షమును, మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షమును నేలనుండి మొలిపించెను (ఆది. 2:8-9).

దీనిని గూర్చి ఈ విధంగా ఆలోచించుదాము. చిత్రకళాకారులు ఏదైన ఒక పటమునకు రంగులు వేయక ముందు వారు చాలా సార్లు మొదట గట్టి కిత్తనారగుడ్డపై పెన్సిలుతో వారాశించే చిత్రాన్ని గీయుచుండు విధంగా, దేవుడు వారి వలె మొదట భూమినంతటిని చక్కదిద్దాడు. భూమి అనబడే గట్టి కిత్తనారగుడ్డ అంతటిపై దేవుడు రంగులు వెంటనే వేయలేదు; ఆయన మామూలుగా ఈ లోకము ఉండాలని ఆయన ఆశించుచుండిన విధంగా ఉండునట్లు ఒక ప్రాథమిక క్రమమును మరియు దృగ్విన్యాసమును ఏర్పాటు చేశాడు. అయితే, రంగులు వేయడం పూర్తి కాలేదు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అదే విధంగా, దేవుడు భూమి యొక్క ఏదో ఒక్క భాగంలో మాత్రమే వైభవోపేతమైన రంగులు వేసి దానిని తన సృష్టికి కేంద్రముగా అలంకరించాడు. భూమి మీద ఈ ప్రదేశం ఏదెను అని పిలువబడింది, మరియు హెబ్రీలో దీని అర్థము "ఆహ్లాదకరమైన" లేక "ఆనందము కలుగజేసేది," గనుక ఈ ప్రదేశం దేవునికి ప్రత్యేకమైన ఆనందాన్ని కలుగజేయునదై యుండినది. ఏదెను తోట మధ్యలో ఒక అత్యంత ఆకర్షణీయమైన వనముండేది, అది ఆశ్చర్యజనకంగా అందమైన స్థలం, ఇంత వరకు ఎన్నడూ చూడని ఎడారిలోని నీటి చెలమవంటిదై, ఒక రాజుకు మాత్రమే తగిన్నట్టి దివ్యమైన పరదైసుగా ఉన్నది. కాబట్టి దేవుడు తన సృష్టిలో సర్వవ్యాపియైనప్పటికిని, కంటికి కనబడని రీతిగా ప్రతి చోట ఉన్నాడన్నట్టు ఉండినది. ఆయన ఏదెను ప్రదేశమును, ప్రత్యేకముగా ఏదెను ఉన్న స్థలమును ఆయన విశేష దృశ్య సన్నిధిగా ఎన్నుకున్నాడు. దేవుడు తనను తాను భూమి మీద మహిమాన్వితముగా ప్రదర్శించుకొన్నది ఇక్కడే. కాని ఈ తోట మరియు దాని ప్రదేశం భూమిలోని ఒక చిన్న భాగము మాత్రమే. మిగిలిన లోకమంతా కొంత మేరకు క్రమపరచబడింది, కాని దాని విషయంలో చేయాల్సింది యింకా ఎంతో ఉండినది.

భూమి ఆయన పరిపాలించు చోటైయుండునట్లు, ఏదెను తోట మరియు ఆయన యొక్క పరిశుద్ధమైన వనము దానిలోని అందమైన మరియు అత్యంత ఆకర్షణీయమైన విషయంగా చేసుకొని దేవుడు మొదట దానిని ఎలా సిద్ధపరచాడో మనము తెలుసుకున్నాము గనుక ఇప్పుడు మన దృష్టిని ప్రపంచ ఆదియుగమునకు సంబంధించిన రెండవ అంశముపై కేంద్రీకరించుదాము: దేవుని రాజ్యములోని ప్రజలు ఈ సమయంలో, దేవుడు మానవ జాతిని తన రాజ్యసంబంధులైన పరిచారకులనుగా, ఉపకరణములుగా అభిషేకించాడు మరియు వారి ద్వారా ఆయన భూమి తన రాజ్యమగునట్లు అవసరమైయుండు తన సిద్ధపాటును పూర్తి చేయును.

## ప్రజలు

దేవుడు ఏదెను తోటలో ఉంచిన మానవుని గూర్చి చేసే వ్యాఖ్యానముల ద్వారా మానవాళి యొక్క ప్రత్యేకమైన పాత్ర సువిదితమవుతుంది. దేవుని తొలి సృష్టిలో ఆయన చేసినదంతయు మంచిది — చాలా మంచిది కూడా — అయ్యుండినప్పటికిని ఆది. 2:18లో మనము ఈ క్రింది మాటలు చదువుతాము:

> మరియు దేవుడైన యెహోవా నరుడు ఒంటరిగా నుండుట మంచిది కాదు; వానికి సాటియైన సహాయమును వానికొరకు చేయుదుననుకొనెను (ఆది. 2:18).

సృష్టి అంతా "మంచిది" అయ్యుండినదని తీర్పునిచ్చిన దేవుడు, తన ప్రత్యేకమైన మరియు పరిశుద్ధమైన వనములో "మంచిగా లేని" ఒక విషయమును కనుగొన్నాడు — ఆదామునకు భార్య లేదు. అది సరే, కాని అది ఎందుకు మంచిది కాదు? ఒక్క మాటలో చెప్పుకుంటే, ఒక్కడు తన సొంతగా సాధించడానికి అతి గొప్పదై యుండిన ఒక పని నిమిత్తమై దేవుడు మానవ జాతిని సృజించాడు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మానవాళి వహించవలసిన పాత్ర రెండు విధాలుగా వర్ణింపబడినదని గుర్తించడం ద్వారా ఈ కార్యభారము ఒక్కనికి ఎందుకు అతి గొప్పదై యుండినదో మనము తెలుసుకొనగలము. ఆదాము మరియు హవ్వ ఆయన యొక్క యాజకులుగా, ఉపప్రతినిధులుగా లేక రాచరిక ప్రతినిధులుగా ఆయనను సేవించాలని దేవుడు వారిద్దరిని సృజించాడు.

## యాజకులు

మొట్టమొదట, ఆదాము మరియు హవ్వపై యాజకత్వ భారము పెట్టబడింది. వారు ఆరాధన సంబంధమైన చర్యలతో దేవునికి పరిచారము చేస్తూ ఆయనను ఘనపరచాలని వారికి పిలుపు ఇవ్వబడింది. పరలోకమందు సింహాసనమున్నచోట నుండు జీవులు చేసేది ఇదే అని మనము ఇదివరకే నేర్చుకున్నాము; గనుక ఈ భూమిపై ఆదాము మరియు హవ్వ కూడా ఇదే పని చేయవలసి ఉండినది. ఆది. 2:15లో ఇలా వ్రాయబడియున్నది:

> మరియు దేవుడైన యెహోవా నరుని తీసికొని ఏదెను తోటను సేద్యపరచుటకును దాని కాచుటకును దానిలో ఉంచెను (ఆది. 2:15).

మొట్టమొదట చూడగానే, ఆదాము మరియు హవ్వ తోటపనివారై యుండాలని దేవుడు వారిని నియమించాడని మనము మామూలుగా అనుకొనవచ్చు, కాని వారు అంతకు మించినవారై యుండిరి. వాస్తవానికి, "తోటను సేద్యపరచుటకును దాని కాచుటకును" అనే వ్యక్తీకరణము అసాధారణమైనదై యున్నది గనుక ఈ కథనమును మొట్టమొదట చదివిన మోషే మరియు ఇశ్రాయేలీయులకు దీని విషయంలో ఒక ప్రత్యేక ప్రాధాన్యత ఉండినది.

ఉదాహరణకు, యాజకులు లేదా లేవీయులు దేవుని గుడారములో చేయవలసిన పనులను వర్ణించడానికి సంఖ్యా 3:8లో ఇదే విధమైన వ్యక్తీకరణములు ప్రయోగించబడ్డాయి. అక్కడ ఇలా చదువుతాము:

> మందిరపు సేవచేయుటకు ప్రత్యక్షపు గుడారముయొక్క ఉపకరణములన్నిటిని, ఇశ్రాయేలీయులు కాపాడవలసిన దంతటిని, వారే కాపాడవలెను (సంఖ్యా 3:8).

ఆదాము మరియు హవ్వలు తోటలో చేప్పట్టవలసిన పాత్ర లేవీయులు దేవునికి చేసే వారి యాజకత్వ పాత్రకు సంబంధించిన సాంకేతికపరమైన ఈ వర్ణనను ప్రదర్శించు విధానాలలో వర్ణింపబడింది.

ఆదాము మరియు హవ్వ దేవుని పరిశుద్ధమైన తోటలో ఉంచబడిరి, అది మోషే దినములలో ఉండిన గుడారము వలెనే, భూమి మీద దైవికమైన రాజు యొక్క ప్రత్యేక సన్నిధైయుండినది. దేవుని పరిశుద్ధ వనమును అందముగా నిర్వహిస్తూ, గొప్ప రాజుకు చేయబడుచుండిన ఆరాధనపూర్వకమైన పరిచారము



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

చేయడం ద్వారా వారు యాజకత్వపు పనులు చేశారు. ఆదాము మరియు హవ్వ దేవుని పరిశుద్ధమైన నివాసములో యాజకులుగా పనులు చేయడం ద్వారా దేవుని సేవించారు.

## ఉప ప్రతినిధులు

రెండవ స్థానంలో, ఆదాము మరియు హవ్వ దేవుని ఉపప్రతినిధులవలె, రాజపదవికి కూడా నియమింపబడ్డారు. నిజానికి, వారు రాజులైన యాజకులైయుండిరి. ఆదాము మరియు హవ్వను గూర్చిన ఈ వర్ణనను మనము ఆది. 1:26లో చూడవచ్చు, అక్కడ ఇలా వ్రాయబడియున్నది:

> దేవుడు మన స్వరూపమందు మన పోలికె చొప్పున నరులను చేయుదము; వారుసముద్రపు చేపలను ఆకాశ పక్షులను పశువులను సమస్త భూమిని భూమిమీద ప్రాకు ప్రతి జంతువును ఏలుదురుగాకనియు పలికెను (ఆది. 1:26).

ఈ వచనము మరియు ఇతర వాక్యభాగాలు మానవులను "దేవుని స్వరూపము లేక దేవుని పోలికె" అని సంబోధిస్తున్నాయని ఇప్పుడు మనకు తెలుస్తుంది. మానవులు వివేచనాత్మకమైన, నైతికమైన జీవులని ఇది అర్థమిస్తుందని గతంలో వేదాంత పండితులు సర్వసాధారణముగా అనుకొన్నారు. కాని ఆదికాండము 1వ అధ్యాయంలోని ప్రధానాంశము ఇది కాదు.

దేవుని పోలికె చొప్పున ఉండుటలోగల ప్రాధాన్యతను అర్థం చేసుకోడానికి, పాత నిబంధనకు సంబంధించిన ప్రాచీన ప్రపంచములో ఇశ్రాయేలు లోపల మరియు దాని చుట్టుప్రక్కల ఉండిన రాజులు మరియు సామ్రాట్టులు "స్వరూపములు," "పోలికెలు," సరికదా, "దేవుని కుమారులు" అని కూడా పిలువబడటం సర్వసాధారణమైన సంగతై యుండినదని తెలిసికొనడం సహాయకరంగా ఉంటుంది. రాజులు మరియు చక్రవర్తులు ఈ బిరుదులు సంపాదించుకొన్నారు ఎందుకనగా పాత నిబంధన కాలములో, రాజరికమునకు సంబంధించినవారు, లోకంలో సామాన్య మానవుల నుండి వారు ప్రత్యేకమైనవారై యున్నారని గుర్తింపబడుచుండిన చాలా ప్రత్యేకమైన పాత్ర కలిగియుండిరని ప్రజలు నమ్మారు. రాజులు పరలోకమునకును భూమికిని మధ్య నిలబడుచుండిరని తలంచబడింది, రాజులు మరియు చక్రవర్తులు పరలోకమందలి దేవుళ్ల చిత్తము లేక జ్ఞానమును నేర్చుకొని, అట్టి పరలోక చిత్తమును భూమి మీద అమలుపరచబడునట్లు చూచుటకు వారి రాజరిక అధికారమును ఉపయోగించుకోడానికి ప్రత్యేకమైన కార్యభారములు కలిగియుండిరని ప్రజలు నమ్మారు. ప్రభువు నేర్పిన ప్రార్థనలో యేసు ప్రయోగించిన భాషను ప్రయోగిస్తే, రాజులు పరలోకమందున్న దేవుని చిత్తమును నేర్చుకొని అది భూమి మీద నెరవేరునట్లు చూడవలసినవారై యుండిరి.

మోషే తన దినములలో విప్లవ భావాలుగలవాడై యుండెనని మనము గమనించవచ్చు, ఎందుకనగా మానవులందరు — కేవలము రాజులు మరియు చక్రవర్తులు మాత్రమే గాక — దేవుని స్వరూపముగలవారై యున్నారని అతడు ప్రకటించాడు. పాత నిబంధన ప్రకారం, మానవులందరు దేవుని ఉపప్రతినిధులై



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

యుండుటకు, వారి దేవుళ్ల పక్షాన ప్రాచీన కాలమందలి చక్రవర్తులు ఏలవలసినవారై యుండిరని భావింపబడినట్లుగానే, దేవుని పక్షాన భూమిని ఏలుటకు, ఇచ్చట ఆయన చిత్తము నెరవేరునట్లు చూచుటకు సృజింపబడ్డారు.

దేవుడు ఆది. 1:27, 28లో వర్ణించినట్టు, మానవాళి పాత్రను ఎందుకు వర్ణించాడో, రాజరికమునకు సంబంధించిన ఈ అలంకారిక దృష్టాంతము వివరిస్తుంది. ఈ వచనాలలో మోషే ఏమని వ్రాశాడో ఒకసారి గమనించండి:

> దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీనిగాను పురుషునిగాను వారిని సృజించెను. దేవుడు వారిని ఆశీర్వ దించెను; ఎట్లనగామీరు ఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి; సముద్రపు చేపలను ఆకాశ పక్షులను భూమిమీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను (ఆది. 1:27-28).

దేవుని స్వరూపమును గూర్చిన ఈ రాజరిక పాత్రను మనము ఈ క్రింది విధంగా క్రోడీకరించవచ్చు. మనము నేర్చుకున్నట్టుగా, దేవుడు సృష్టిలో క్రమము మరియు అందము విషయమై కొంత పరిమాణమును నెలకొల్పాడు, మరియు వారు తన అద్భుతకరమైన, పరిశుద్ధమైన వనములో యాజకులుగా ఆయన సేవించాలని ఆయన మానవాళిని అక్కడ ఉంచాడు. అయితే తన రాజరిక స్వరూపముగలవారు సంఖ్యాపరంగా అభివృద్ధి చెందుచు ఏదెను తోటను మాత్రమే కాదు గాని భూమియంతటిని నింపించాలని కూడా దేవుడు పిలుపునిచ్చాడు. ఇంకా, వారు ఏదెను తోటపై మాత్రమే గాక సమస్త భూమిపై తన పెత్తనమును చెలాయింపవచ్చునని ఆయన వారిని నియమించాడు.

పరలోకపు గొప్ప రాజు ఆయన రాజ్య విస్తరణకు ప్రయోజనపడు పనిముట్టుగా మానవజాతిని నియమించాడు. వారు దేవుని చిత్తమును భూమి మీద నెరవేరుస్తూ లోకమందంతటను ఆయన యాజకులుగా ఆయనను సేవించునట్లు, మానవులు అభివృద్ధిచెందుచు, సకల ప్రదేశాలకు విస్తరిస్తూ, భూమినంతటిని దేవుని వనముగా మార్చవలసినవారై యుండిరి. లోకమందంతటను దేవుని రాజ్యమును వ్యాపింపజేయవలెనసేదే దేవుడు మానవులను ఈ భూమి మీద ఉంచుటలోగల ఉద్దేశమైయుండినది.

దేవుడు ప్రారంభములోనే ఆయన రాజ్యము నిమిత్తమై ఒక స్థలమును మరియు ఒక ప్రజను నెలకొల్పిన విధానమును, మనము తెలుసుకొన్నాము, గనుక దేవుని రాజ్యం ప్రాచీన కాలంలో ఈ భూమి మీద విస్తరించిన పురోభివృద్ధిని గూర్చిన పటము గీయడానికి మనము సిద్ధంగా ఉన్నాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## పురోభివృద్ధి

మోషే నివేదికను మనము ఈ క్రింది మూడు విధాలుగా క్రోడీకరించుదాము. మొదటిగా, గొప్ప రాజునకు విరోధంగా సంభవించిన విశ్వసంబంధమైన విద్రోహమును గూర్చి చెప్పుకొందుము. రెండవదిగా, మానవజాతి యొక్క దుర్నీతి ఊహింపశక్యముకాని మేరలకు విస్తరిల్లి తీవ్రమైన తీర్పునకు దారితీసిన విధానమును మనము తెలుసుకొందాము. మూడవదిగా, మానవాళి విఫలమైనప్పటికిని, ఆయన రాజ్యసంబంధమైన ఉద్దేశములను ఈ భూమి మీద నెరవేర్చడానికి దేవుడు దీర్ఘకాలిక వ్యూహమును బయలుపరచాడనే విషయాన్ని మనము తెలుసుకుంటాము. మొదట భూమి మీద సంభవించిన విద్రోహమును తెలుసుకుందాము.

### విశ్వసంబంధమైన విద్రోహం

దేవుని చిత్తమును భూమి యందంతటను నెరవేర్చుటకు బదులుగా, ఆదాము మరియు హవ్వ సాతాను శోధనకు లోనయ్యారు, తినవద్దని నిషేధింపబడిన ఫలమును తిన్నారు, దైవికమైన రాజునకు విరోధంగా తిరుగుబాటు చేశారు. తత్ఫలితంగా, ఏదెను తోట అందమును భూదిగంతముల మేరకు విస్తరింపజేయడానికి బదులుగా, వారు ఏదెను తోటలో నుండి వెలివేయబడ్డారు, శాపము చేత సతమతమవుతూ జీవించాల్సి వచ్చింది.

అట్లయినప్పటికిని, దేవుని రాజ్య నిర్మాణకులుగా మానవజాతి యొక్క బాధ్యత పూర్తిగా ఆవిరైపోలేదు. అట్లయినను, ఆదాము మరియు హవ్వ యింకను దేవుని ఆరాధింపవలసినవారై యుండిరి; ఇంకను అభివృద్ధి చెందుచు పెత్తనం చెలాయించవలసినవారై యుండిరి. అయినను, వారు తిరిగిబాటు చేయుటనుబట్టి, అభివృద్ధి చెందడము మరియు పెత్తనం చెలాయించడము కష్టతరమగునట్లును, అది ఆశాభంగంగలదై బాధాకరమైనదగునట్లు వారు మరియు భూమి శపింపబడినవి. అభివృద్ధినొంది భూమిని నిండించు విషయంలో, దేవుడు హవ్వతో సెలవిచ్చిన మాటలు ఆది. 3:16లో ఇలా ఉన్నాయి:

> నీ ప్రయాసమును నీ గర్భవేదనను నేను మిక్కిలి హెచ్చించెదను; వేదనతో పిల్లలను కందువు (ఆది. 3:16).

పెత్తనం చెలాయించడమును గూర్చి దేవుడు ఆదాముతో సెలవిచ్చిన మాటలు ఆది. 3:17లో ఇలా ఉన్నాయి:

> . . . నీ నిమిత్తము నేల శపింపబడియున్నది; ప్రయాసముతోనే నీవు బ్రదుకు దినములన్నియు దాని పంట తిందువు (ఆది. 3:17).



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

దేవుని స్వరూపమును ధరించినవారై తమ కార్యభారమును చెప్పుకోదగినంత సులభంగాను, అంతములేని గౌరవముతోను నెరవేర్చుటకు బదులుగా, వైరముతో నిండిన లోకంలో నివాసముంటూ, దేవుని పోలికెగా బాధను మరియు నిష్ఫలమును అనుభవిస్తూ జీవించునట్లు మానవాళి బలవంతం చేయబడింది.

## దుర్నీతి మరియు తీర్పు

రెండవదిగా, ప్రాచీన కాలములో మానవజాతి దుర్నీతి బాటలో కొనసాగుచుండినది, అయితే చివరకు అది తీవ్రమైన దేవుని తీర్పునకు దారితీసింది. మానవజాతి పాపములో పడిపోక మునుపు, పిల్లలను కనుట వలన విశ్వసనీయమై యుండిన ఉపప్రతినిధులు మరియు యాజకుల వంటి మరి ఎక్కువ పోలికెలు ఉత్పత్తి అయ్యేవి. కాని ఆదాము మరియు హవ్వ పాపము చేసినప్పుడు, వారి శారీరక సంతానము దేవుని యెడల నిజముగా విశ్వసనీయమైనవారై యుంటారనే హామీ ఏమీ లేకుండాపోయింది. వాస్తవానికి, పతనమైన వారి స్వభావమునుబట్టి, పాపము యొక్క శక్తి నుండి దేవుడు వారిని విమోచింపనట్లయితే వారిలో ఏ ఒక్కరైనను విశ్వసనీయమైనవారై యుండలేరు.

విచారకరంగా, మానవ జాతిలోని ఎక్కువ మంది దేవునికి విరోధంగా తిరుగుబాటు చేయుచునే యుండిరి. ఆదాము హవ్వల తొలి పుత్రుడు కయీను, అతని తమ్ముడైన హేబెలును హతమార్చాడు. కయీను సంతానము అభివృద్ధిచెందుచు భూమి మీద పెత్తనం చెలాయించడం చేపట్టినది మొదలుకొని వారి తిరుగుబాటు రాను రాను మరింత ఘోరమైనదయ్యిందని ఆదికాండము 4వ అధ్యాయంలోని కయీను వంశావళి మనకు తెలియజెప్పుతుంది. రాజులైన దేవుని యాజకులుగా దేవుని ఆరాధిస్తూ, భూమి మీద ఆయన చిత్తమును నెరవేర్చుచు, బలమైన మానవ సంస్కృతిని నిర్మించడానికి బదులుగా, కయీను సంతానము తమ్మును తాము హెచ్చించుకొనుచు దేవుని ఏలుబడిని ఎదిరించిన సంస్కృతులను నెలకొల్పారు. వాస్తవానికి, కాలము దొర్లిపోయిన కొలది, మానవులు నికృష్టంగా నీతి చెడినవారయ్యారు గనుక దేవుడు మానవజాతిని నిర్మూలించాలని తీర్మానించుకొన్నాడు. ఆది. 6:5-7లో మనము ఈ క్రింది మాటలు చదువుతాము:

> నరుల చెడుతనము భూమిమీద గొప్పదనియు, వారి హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహోవా చూచి తాను భూమిమీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను. అప్పుడు యెహోవా నేను సృజించిన నరులును నరులతోకూడ జంతువులును పురుగులును ఆకాశ పక్ష్యాదులును భూమిమీద నుండకుండ తుడిచివేయుదును; ఏలయనగా నేను వారిని సృష్టించినందుకు సంతాపము నొందియున్నాననెను (ఆది. 6:5-7).



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## దీర్ఘకాలిక వ్యూహము

ఏదేమైనా, మూడవదిగా, దేవుడు తన రాజ్యమును లోకమందంతటను విస్తరింపజేయుటకు ఒక దీర్ఘకాలిక వ్యూహమును రూపొందించాడని ప్రాచీన చరిత్ర మనకు తెలియజేస్తుంది. నిజానికి, మానవ జాతి యొక్క దుర్నీతిని బట్టి, పాపము యొక్క అధికారములో నుండి ఏర్పరచుకొనబడిన ఒక గుంపును విమోచించి, వారి ద్వారా ఆయన రాజ్యమును నిర్మించవలెనని దేవుడు నిశ్చయించుకొన్నాడు. ఈ పోలికెలు ఆయన సంకల్పములను సాధించునట్లు దేవుడు వారి పట్ల రక్షణార్థమైన కనికరమును కనుపరచాడు.

ఈ దీర్ఘకాలిక వ్యూహమును గూర్చిన తొలి సంకేతం ఆదాము హవ్వలు పాపము చేసిన వెంటనే ఆది. 3:15లో ప్రవేశపెట్టబడింది. అక్కడ, ఆదాము హవ్వలు పాపము చేయునట్లు వారిని రెచ్చగొట్టిన సర్పమును దేవుడు ఈ క్రింది విధంగా శపించాడు:

> మరియు నీకును స్త్రీకిని నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తలమీద కొట్టును; నీవు దానిని మడిమె మీద కొట్టుదువని చెప్పెను (ఆది. 3:15).

దీని సారాంశమేమనగా, సాతాను మరియు వానిని వెంబడించిన మానవులు హవ్వ సంతానమునకు కష్టము కలిగిస్తూనే ఉండినను, చివరకు ఆమె యొక్క నిజమైన సంతానము, విమోచింపబడిన మానవాళి, సర్పము యొక్క తలను చితకబాదును, విశ్వసంబంధమైన విద్రోహములోనికి వారిని నడిపించిన వానిని జయించుదురని దేవుడు వాగ్దానం చేశాడు. అందుచేత పౌలు రోమా క్రైస్తవులకు రోమా 16:20లో ఈ క్రింది విధంగా అభయమిస్తున్నాడు.

> సమాధానకర్తయగు దేవుడు సాతానును మీ కాళ్ల క్రింద శీఘ్రముగా చితక త్రొక్కించును (రోమా. 16:20).

విమోచన గూర్చిన ఈ నిరీక్షణ ఆదాము హవ్వల కాలము నుండి ఈనాడు మన కాలము వరకు కొనసాగింది.

ఇతోధికంగా దుర్నీతిమయమగుచుండిన కయీను వంశావళికి తారతమ్యంగా, మూడవ కుమారుడు, విశ్వసనీయమైన హేబెలు స్థానంలో షేతు పుట్టాడు. ఆదికాండము 5వ అధ్యాయంలోగల వంశావళి మనకు తెలియజేయుచున్నట్టుగా, షేతు మరియు అతని సంతానము దేవుని చిత్తము భూమి మీదను నెరవేరవలెనని ఆశిస్తూ, అందునిమిత్తం వెదకుతూ, వారు తమ జీవితముల ద్వారా దేవుని ఘనపరచారు. భూమి మీద పరిస్థితులు తీవ్రంగా విషమించినప్పుడు దేవుడు మానవాళిని విశ్వవ్యాప్త జలప్రళయము ద్వారా నాశనము చేసినప్పుడు సహితం, విశ్వసనీయమైనవాడై దేవుని దృష్టిలో అనుగ్రహము పొందినవాడు షేతు సంతానములో

ఒకడుండినాడు — నోవహు. మిగిలిన మానవాళినంతటిని జలప్రళయము సమూలంగా నిర్మూలించినప్పుడు దేవుడు నోవాహును మరియు అతని కుటుంబాన్ని కాపాడి సంరక్షించాడు.

ఇప్పుడు, ఆది. 8:21-22లో ప్రాచీన చరిత్ర ముగింపునకు వచ్చుచుండినప్పుడు విమోచింపబడిన ఆయన పోలికెలో నున్న ప్రజలు దేవుని స్వరూపులుగా వారి ఉద్దేశములను నెరవేర్చగల దీర్ఘకాలిక, జటిలమైన వ్యూహమునకు దేవుడు మార్గమును సుగమంచేశాడు. అక్కడ ఇలా చదువుతాము:

> అప్పుడు యెహోవా ఇంపయిన సువాసన నాఘ్రాణించి ఇక మీదట నరులనుబట్టి భూమిని మరల శపించను. ఎందుకనగా నరుల హృదయాలోచన వారి బాల్యమునుండి చెడ్డది. నేనిప్పుడు చేసిన ప్రకారముగా ఇకను సమస్త జీవులను సంహరింపను. భూమి నిలిచియున్నంతవరకు వెదకాలమును, కోతకాలమును శీతోష్ణములును వేసవి శీత కాలములును రాత్రింబగళ్లును ఉండక మానవని తన హృదయములో అనుకొనెను (ఆది. 8:21-22).

దేవుని ప్రేరణను గమనించండి. విమోచింపబడిన మానవులు సహితం పాపాత్మకమైనవారై యున్నారని ఆయన గుర్తిస్తున్నాడు. పాపము పతనమైన తన పోలికెగలవారిని నాశనం చేస్తూనే ఉంటుందని ఆయన అర్థంచేసుకున్నాడు. కాబట్టి, తన సృష్టి మానవ జాతికి దీర్ఘకాలిక స్థిరత్వమును సమకూర్చునట్లు పరలోక రాజు దానిని ఏర్పాటు చేశాడు. ఈ స్థిరత్వమునకు కారణము ఆది. 9:1లో విదితమవుతుంది:

> మరియు దేవుడు నోవహును అతని కుమారులను ఆశీర్వదించి మీరు ఫలించి అభివృద్ధిపొంది భూమిని నింపుడి (ఆది. 9:1).

మానవాళి యొక్క ఆరంభ పనిని ఆయన పోలికెలో ఉండి విమోచింపబడివారు నెరవేర్చునట్లు దేవుడు సృష్టిలో సుస్థిరతను నెలకొల్పి విశ్వవ్యాప్తమైన జలప్రళయమును గూర్చిన బెదిరింపును తొలగించాడని ఒక్క మాటలో చెప్పుకొనవచ్చు.

మిగతా లేఖనము సుస్పష్టం చేస్తున్న విషయమేమిటో దేవునికి తెలియును. ఆయన రాజ్యము విస్తరించాల్సిన బాట తిన్నగాను, అడ్డంకులు లేనిదిగాను ఉండదు. ఆయన సొంత ప్రజలే తొట్రిల్లి పడిపోతారని ఆయనకు తెలుసు, మరియు ఆయన రాజ్య విస్తరణను చేపట్టు సేవకులకు ఎదురయ్యే వ్యతిరేకత హెచ్చుతగ్గులవుతుంటుందని కూడా ఆయనకు తెలియును. కాబట్టి ముందున్న భవిష్యత్తులో ఒకానొక దినాన ఆయన విమోచించినవారు, విశ్వసనీయమైన పోలికెలుగలవారు పతనమైన ఈ లోకమందంతటను ఆయన రాజ్యమును విస్తరింపజేయు కార్యములను చేయునట్లు, ఆయన సృష్టిలోని దీర్ఘకాలిక స్థిరత్వమును గూర్చిన ఒక నూతన క్రమమును నెలకొల్పాడు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

గనుక ఏదెను తోటలో మొదలైన దేవుని చారిత్రాత్మక రాజ్యము రాజులైన యాజక సమూహమైన, మానవ జాతి చేత భూదిగంతముల వరకు విస్తరించాల్సి యున్నది. పాపము వలన ప్రవేశపెట్టబడిన సంక్లిష్టతలు ఏర్పడినప్పటికిని, వారు ఆయన రాజ్యము పరలోకమందు నెరవేరుచున్నట్లు ఈ భూమి మీదను నెరవేర్చునట్లు ఆయన పోలికెలో ఉన్నవారిలో కొందరిని విమోచించడానికి దేవుడు ఒక దీర్ఘకాలిక చారిత్రాత్మకమైన వ్యూహమును కల్పించాడు. ప్రాచీన చరిత్రను గూర్చినవి ప్రాథమికమైన ఈ రూపురేఖలు బైబిలు సంబంధమైన మిగతా చరిత్ర కొరకైన మార్గమును సరాళం చేశాయి.

భూమి చరిత్ర యొక్క ఆదిమ సంవత్సరాలలో దేవుని రాజ్యం ఆరంభమైన తీరుతెన్నులను గూర్చి తెలుసుకున్నాము గనుక, పాత నిబంధనలోని అత్యధిక భాగంలో వివరింపబడిన తరువాత పెద్ద చారిత్రాత్మకమైన దశను గూర్చి తెలుసుకోడానికి మనమిప్పుడు సంసిద్ధంగా ఉన్నామని అర్థం, దేవుడు ప్రత్యేకించి ఇశ్రాయేలుతో ఆయన ఏర్పాటుచేసుకొనిన జనాంగముగా వ్యవహరించిన కాలమే, ఆ దశ.

## ఇశ్రాయేలు జనాంగము

పాత నిబంధన దృష్టికోణం ప్రకారం, ప్రాచీన ఇశ్రాయేలు జనాంగము యొక్క చరిత్ర దేవుని రాజ్యము పరలోకమందు వలె భూమి మీదకు వచ్చుటను గూర్చిన ప్రధాన ప్రగతికి ప్రతినిధిగా నిలిచింది.

దేవుని రాజ్యం ప్రాచీన ఇశ్రాయేలులో అభివృద్ధి చెందిన విధానమును తెలుసుకోడానికి మనము మరొక పర్యాయం మూడు అంశాలను పరిశీలించుదాము. మొదటిది, చరిత్ర యొక్క ఈ దశలోని రాజ్యమునకు సంబంధించిన స్థలమును మనము అన్వేషిద్దాము. రెండవది, రాజ్యమునకు సంబంధించిన ప్రజలను చూద్దాము. మూడవదిగా, రాజ్యము యొక్క ఈ కాలములోని పురోభివృద్ధిని మనము పరీక్షించుదాము. అలాగైతే, మొదట, ఇశ్రాయేలు జనాంగములోని దేవుని రాజ్యము యొక్క స్థలమును అన్వేషిద్దాము.

### స్థలము

ఇశ్రాయేలు యొక్క పితామహుడైన అబ్రాహాముతో మొదలుపెట్టడం, ఈ కాలములోని రాజ్యము యొక్క స్థలమును గూర్చిన మన చర్చను మొదలుపెట్టడానికి ఉత్తమమైన మార్గములలో ఒకటి. అబ్రాహాము ఇశ్రాయేలు యొక్క పితామహుడైయుండెను కాబట్టి దేవుడు అబ్రాహాముతో ఇచ్చిపుచ్చుకొనుచుండిన విషయాలు దేవుడు ఇశ్రాయేలు ద్వారా చేయనైయుండిన ప్రతి విషయానికి మార్గమును సుగమంచేశాయి. ఆది. 12:1-3లో, అబ్రాహాము ఆయన యొక్క ప్రత్యేకమైన సేవకుడై యుండునట్లు దేవుడు అబ్రాహామును ఈ క్రింది మాటలతో పిలిచిన విధానమును మనము చదువుతున్నాము:



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> యెహోవానీవు లేచి నీ దేశమునుండియు నీ బంధువుల యొద్దనుండియు నీ తండ్రి యింటి నుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్లుము. నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును, నీవు ఆశీర్వాదముగా నుందువు. నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను; నిన్ను దూషించువాని శపించెదను; భూమియొక్క సమస్తవంశములు నీయందు ఆశీర్వదించబడును (ఆది. 12:1-3).

మొదటి వచనంలో దేవుడు సెలవిచ్చిన విషయాన్ని గమనించండి; అబ్రాహాము మెసపొతమియలోని తన స్వస్థలమును విడిచిపెట్టి అతడు ఇంత వరకును చూడని ప్రదేశానికి వలనవెళ్లవలెనని దేవుడు పిలుపునిచ్చాడు.

ఆదికాండము 12వ అధ్యాయమంతటిని చదువుతుంటే, దేవుడు అబ్రాహామును, దక్షిణ మెసపొతమియలోని ఊరు అను తన స్వస్థలము నుండి ఉత్తర మెసపొతమయలోని హారాను ప్రాంతమునకు, ఆ తరువాత హారాను నుండి "పరిశుద్ధ ప్రదేశము" అని ఇప్పుడు మనము పిలుస్తున్న కనాను దేశానికి నడిపించాడనే విషయాన్ని మనము తెలుసుకుంటాము. అబ్రాహాము కనాను దేశం చేరుకొన్నప్పుడు, అబ్రాహాము సంతానము నిర్దిష్టమైన ఈ భౌగోళిక ప్రదేశాన్ని తమ స్వదేశంగా పొందుదురని దేవుడు ధృవీకరించాడు, మరియు మిగతా పాత నిబంధన సుస్పష్టం గావిస్తున్నట్టు, అబ్రాహామునకు వాగ్దానం చేయబడిన ప్రదేశం, ఇప్పటి నుండి ఇక ముందటి ప్రపంచంలో దేవుని కార్యకలాపముల కొరకు భౌగోళిక కేంద్రమయ్యింది.

అబ్రాహాము వాగ్దాన దేశానికి వెళ్లవలెనని ఆయనకియ్యబడిన పిలుపు, దేవుని రాజ్యము యొక్క స్థలమును గూర్చి మనము కనీసం రెండు విధాలుగా అర్థం చేసుకోడానికి సహాయకరంగా ఉంటుంది. మొదటిది, వారు ఆయన రాజ్యము యొక్క ఆదిమ కేంద్రములో ఆయనను సేవించాలని దేవుడు అబ్రాహామును మరియు ఇశ్రాయేలును పిలిచాడని మనము తెలుసుకుంటాము. రెండవది, ఆయన రాజ్యమును ఆ ఆదిమ కేంద్రానికి ఆవల విస్తరింపజేయాల్సిందని దేవుడు ఇశ్రాయేలును పిలిచాడనే విషయం అర్థమవుతుంది. వారు ఆయనను ఆయన రాజ్యము యొక్క ఆదిమ ప్రధాన కేంద్రములలో సేవించాలని దేవుడు అబ్రాహామును మరియు, ఆయన సంతానమును పిలిచాడనే ఆలోచనను మొదట చూద్దాము.

### ఆరంభ కేంద్రం

మనమిదివరకు చూచినట్టుగా, ఏదెను తోట దేవుని ఇహలోక రాజ్యపు ఆదిమ కేంద్రమైయుండినది. దురదృష్టవశాత్తు, ఏదెను తోట మెసపొతమియలో ఉండినదనే తప్పుడు నమ్మిక అనేక మంది అనువాదకులలో ఉన్నది. గనుక, కనాను దేశానికి వెళ్లడానికి అబ్రాహాము వాస్తవానికి ఏదెను తోట యొక్క పరిసర ప్రాంతాన్ని



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

విడిచిపెట్టాడనే తప్పుడు నమ్మిక కూడా వారిలో ఉన్నది. కాని అబ్రాహామునకు వాగ్దానము చేయబడిన ప్రదేశమునకును ఏదెను ప్రాంతమునకును మధ్య లేఖనము అత్యంత సన్నిహిత సంబంధాన్ని రాబట్టుతున్నది.

వాస్తవానికి, దేవుడు అబ్రాహామును ఏదెను తోటకు దూరంగా కంటే, దానికి సమీపంగా వచ్చునట్లు పిలిచాడు. ఆది. 2:10-14లో దేవుడు ఏదెను తోట యొక్క సరిహద్దులను వర్ణించిన విధానమును గమనించండి:

> మరియు ఆ తోటను తడుపుటకు ఏదెనులోనుండి ఒక నది బయలుదేరెను; అది అక్కడ నుండి చీలిపోయి నాలుగు శాఖలాయెను. మొదటిదాని పేరు పీషోను; అది హవీలా దేశమంతటి చుట్టు పారుచున్నది . . . రెండవ నది పేరు గీహోను; అది కూషు దేశమంతటి చుట్టు పారుచున్నది. మూడవ నది పేరు హిద్దెకెలు . . . నాలుగవ నది యూఫ్రటీసు (ఆది. 2:10-14).

ఏదెను తోట సరిహద్దులు నాలుగు నదులు: పిషోను మరియు గీహోను నదులు, ఐగుప్తునకు ఈశాన్యమున నున్న ప్రాంతంలో నైరుతి దిశన గల ప్రదేశములతో సంబంధంగలవి, మరియు హిద్దెకెలు మరియు యూప్రటీసు నదులు, కనానునకు నైరుతి దిశన గల ప్రాంతములతో సంబంధంగలవి.

భౌగోళిక సంబంధమైన ఈ సూచనలు మనకు ముఖ్యమైనవై యున్నవి, ఎందుకనగా వాగ్దానం చేయబడిన ప్రదేశం ఇటువంటి సరిహద్దులనే కలిగియుండినది. ఆది. 15:18లో ఇలా వ్రాయబడియున్నది:

> ఆ దినమందే యెహోవా ఐగుప్తు నది మొదలుకొని గొప్ప నదియైన యూఫ్రటీసు నది వరకు ఈ దేశమును . . . నీ సంతానమున కిచ్చియున్నానని (ఆది. 15:18).

"ఐగుప్తు నది" అనేది నైలు నది కాదు, కాని ఐగుప్తునకు ఈశాన్యములోగల చిన్న నదులలో ఒకటని అనువాదకులలో అనేకులు అంగీకరిస్తారు. కాని విషయమేమనగా, ఈశాన్యములో యూప్రటీసు నది మరియు నైరుతి దిశలో ఐగుప్తు దేశం సరిహద్దుగా నున్న ప్రదేశమును దేవుడు అబ్రాహామునకు వాగ్దానం చేశాడని మనము గమనించగలము, మరియు మనము చూచినట్టుగా, వాగ్దానము చేయబడిన ప్రదేశము యొక్క భౌగోళిక సరిహద్దులు ఏదెను తోట సరిహద్దులను ప్రతిబింబిస్తున్నాయి. కనాను దేశానికి మనము ఏదెనుతో ఎంత దగ్గర సంబంధాన్ని జోడించాలో అనేది కొంత మేరకు ప్రశ్నార్థకమైనప్పటికిని, దేవుడు అబ్రాహామును కనాను దేశానికి పిలిచినప్పుడు, ఆదాము మరియు హవ్వ మొట్టమొదట దేవునిని సేవించిన చోటికే పిలిచాడనే విషయమైనా స్పష్టంగా ఉన్నది. కాబట్టి, ఏదెను తోట దేవుని సన్నిధికి ఈ భూగ్రహంపై ప్రధాన కేంద్రంగా ఆదిలోనే నెలకొల్పబడినట్టుగానే, ప్రాచీన చరిత్ర యొక్క వైఫల్యముల తరువాత, దేవుడు తన ప్రత్యేకమైన సేవకుడు రాజ్యమును పునఃనిర్మించుటను ఆరంభించునట్లు భౌగోళిక కేంద్రానికే పిలిచాడు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

దేవుడు ఈ దేశమును పాత నిబంధన ఇశ్రాయేలుకు ఒక చివరి గమ్యముగా కాదు, కాని ఆయన ఏలుబడిని భూదిగంతముల వరకు విస్తరింపజేయు నిమిత్తమైన ఒక ప్రారంభ వేదికగా ఇచ్చాడనేది వాగ్దానము చేయబడిన దేశమునకును ఏదెను తోటకును మధ్య నున్న సంబంధమును గూర్చిన రెండవ ధ్వనింపై యున్నది.

## విస్తరింపు

వాగ్దానము చేయబడిన దేశం అబ్రాహామునకుగాని మరియు ఇశ్రాయేలునకుగాని చిట్టచివరి భౌగోళిక లక్ష్యమై యుండలేదు — అది భూమి మీద దేవుని రాజ్యమునకు అతి చిన్న చోటైయుండినది. ఆది. 12:3ను మరొక పర్యాయం గమనించండి:

> నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను; నిన్ను దూషించువాని శపించెదను; భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడును (ఆది. 12:3).

అబ్రాహాము మరియు అతని సంతానము పట్ల ప్రదర్శింపబడిన దానికి ప్రతిస్పందనగా జనాంగములను ఆశీర్వదిస్తూ, శపించడమనే ప్రక్రియ ద్వారా, భూమి మీద నున్న సమస్త ప్రజలు చివరకు ఆశీర్వదింపబడుదురు. అబ్రాహాము విశ్వాసము — ప్రస్తుతం క్రైస్తవ విశ్వాసం — వేర్వేరు జాతులకు మరియు భాషాపరమైన గుంపులకు వ్యాపిస్తుందనేది వాగ్దానములోని ఒక కోణమైనప్పటికిని, అలా జరుగుతుందని ఈ వాగ్దానము సామాన్యంగా సూచించడంలేదు. ఈ వచనము భూగోళిశాస్త్రమును సహితం సూచిస్తుంది. అబ్రాహాము యొక్క ఆశీర్వాదము భూమియందంతటను ఉన్న సకల కుటుంబాలకు చేరుకుంటుంది.

ఈ హేతువునుబట్టియే అపొస్తలుడైన పౌలు, దేవుడు అబ్రాహామునకిచ్చిన వాగ్దానమును రోమా 4:13లో ఈ క్రింది విధంగా క్రోడీకరించాడు:

> అతడు లోకమునకు వారసుడగునను వాగ్దానము అబ్రాహామునకైనను అతని సంతానమునకైనను ధర్మశాస్త్రమూలముగా కలుగలేదుగాని విశ్వాసమువలననైన నీతి మూలముగానే కలిగెను (రోమా 4:13).

అబ్రాహామునకు స్వాస్థ్యముగా ఏదో ఒక చిన్న భూభాగం మాత్రమే వాగ్దానం చేయబడలేదు; అతనికి లోకమంతా వాగ్దానం చేయబడింది. కనాను దేశం ఈ సంపూర్ణ స్వాస్థ్యమునకు, లోకం మొత్తానికి, కేవలము ఒక సంచకరువు వంటిదయ్యింది.

వాగ్దానము చేయబడిన దేశము యొక్క ఆదిమ సరిహద్దులకు ఆవల వరకుండిన దేవుని రాజ్యము యొక్క విస్తరింపు పాత నిబంధనలోని వెవ్వేరు కాలములలో అల్పమైన పరిమాణంతో చోటుచేసుకొన్నది. మోషే రోజుల్లోను మరియు అటుతరువాత కాలంలోను, యోర్దానుకు తూర్పునగల రెండున్నర గోత్రములు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఆక్రమించుకొన్నారు. ఆ యా రాజులు ఏలుబడిలో, ఇశ్రాయేలు యొక్క సరిహద్దులు ఉత్తరము, తూర్పు, మరియు దక్షిణ దిశలలో విస్తరించాయి. కాబట్టి పాత నిబంధన ఇశ్రాయేలు కాలములో దేవుని రాజ్యము యొక్క ప్రధాన కేంద్రం కనాను దేశమైయుండినది, కాని అట్లయినప్పటికిని దేవుని రాజ్యము భూదిగంతముల వరకు వ్యాపించుట ఆరంభమయ్యింది.

పాత నిబంధన ఇశ్రాయేలు రోజులలోని రాజ్యము యొక్క స్థలమును మనస్సులో ఉంచుకొని, మనమిప్పుడు రాజ్యసంబంధమైన ప్రజలను గూర్చి తెలుసుకుందాము.

## ప్రజలు

ఈ కాలములోని దేవుని ప్రజల చరిత్ర చాలా సంక్లిష్టమైనది, గనుక మనలను మనము కొన్ని ప్రధానాంశములకే పరిమితం చేసుకొనడం మంచిది. అయినప్పటికీ, దేవుని రాజ్యములో ఇశ్రాయేలు పాత్రను గూర్చిన సమగ్రమైన బృహత్ పటమును మనము చూడగలుగుతాము, అది దేవుడు మానవ జాతిని గూర్చి కలిగియుండిన ఆరంభ ఉద్దేశములతో ఎలా కలుస్తుందో చూస్తాము. మూడు విషయాలను చూద్దాము: మొదటిది, రాజ్యము నిమిత్తము ఇశ్రాయేలును ఒక ప్రత్యేక జనాంగముగా ఏర్పరచుకొనుట; రెండవది, ఈ ప్రజలు ఒక యాజక సమూహముతో కూడిన రాజ్యముగా రూపుదిద్దుకొనుట; మూడవది, రాజ్యసంబంధులైన ప్రజలను నడిపించడానికి అధికారపూర్వకమైన యాజకులు మరియు రాజులు నియమింపబడుట. మొట్టమొదటిగా, ఇశ్రాయేలు ఒక ప్రత్యేక జనాంగముగా ఏర్పరచుకొనబడుటను చూద్దాము.

### ఇశ్రాయేలును ఏర్పరచుకొనుట

ప్రాచీన చరిత్ర కాలములో, లోకములోనికి పాపము ప్రవేశపెట్టబడుటతో, లోకములో ఆయన యొక్క ప్రత్యేకమైన పోలికెలుగా ప్రయోజనపడునట్లు దేవుడు మానవాళి యంతటి నుండి ఒక కుటుంబాన్ని ఏర్పరచుకొన్నాడనే విషయాన్ని మనము జ్ఞాపకముంచుకోవాలి.

ఒకే ఒక్క కుటుంబము యొక్క నమూనాను మనము మొదట ఆదికాండము 5వ అధ్యాయంలో చూస్తాము, అక్కడ ఆదాము కుమారుడైన షేతు నీతిగల మానవాళి వంశానికి తండ్రి అయ్యాడు. అటుతరువాతః, అతని సంతానమైన నోవహు ద్వారా షేతు కుటుంబాన్ని దేవుడు కొనసాగించాడు. నోవహుకు ముగ్గురు కుమారులని మీరు జ్ఞాపకము చేసుకోవచ్చు: షేము, హాము మరియు యాపెతు. అయితే షేము మాత్రమే దేవుడు ప్రత్యేకముగా ఏర్పరచుకొనిన పోలికె లేక కుమారుడైయుండెను. ప్రత్యేకమైన ఈ పాత్రను కొనసాగించడానికి షేము సంతానములో నుండి ఒకడు, అనగా అబ్రాహాము ఏర్పరచుకొనబడెను. ఆ తరువాత అబ్రాహాము యొక్క అద్భుతకరమైన కుమారుడు ఇస్సాకు ఏర్పరచుకొనబడి ఈ వంశక్రమమును కొనసాగించెను. ఆ తరువాత, ఇశ్రాయేలు అని కూడా పిలవబడినవాడైన ఇస్సాకు కుమారుడైన యాకోబు,



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

దేవుడు ప్రత్యేకంగా గౌరవించిన పోలికె అయ్యాడు. చివరిగా, యాకోబునకు పన్నెండు మంది కుమారులు, వారు యోసేపు మరియు అతని సహోదరులు, మరియు ఈ పన్నెండు మంది కుమారులు ఇశ్రాయేలు జనాంగము యొక్క పన్నెండు గోత్రములకు తండ్రులయ్యారు. ఈ పన్నెండు గోత్రములను దేవుడు ప్రియాతిప్రియంగా ప్రేమించాడు, మరియు వారికి దేవుని ప్రజలు అనే ప్రత్యేక బిరుదునిచ్చాడు, వారు దేవుడు తన తొలిచూలు సంతాము వలె ప్రేమించినవారై యుండిరి. మానవజాతిలోని జనాంగములన్నిటిలో నుండి, ఇశ్రాయేలు గోత్రములు దేవుని రాజ్యసంబంధులైన ప్రత్యేక ప్రజలైయుండిరి.

## యాజకుల రాజ్యము

రెండవది, దేవుడు ఇశ్రాయేలు గోత్రములను ఏర్పరచుకొన్నాడు, ఆదాము మరియు హవ్వకు ఇవ్వబడిన ఆదిమ యాజాకత్వ మరియు రాచరిక పాత్రలను నెరవేర్చునట్లు ఆయన వారిని ఒక యాజక సమూహముతో కూడిన రాజ్యముగా చేశాడు. ఇశ్రాయేలు, ఆయన రాజ్య నిర్మాణములోని అత్యంత ప్రత్యేకమైన ఈ పాత్రను పూరించవలసి యున్నదని దేవుడు రూఢియైన మాటలలో ప్రకటించాడు, మరియు ఈ విషయాన్ని మనము నిర్గమ 19:4-6లో చూడవచ్చు. ఇశ్రాయేలు సీనాయి పర్వతము యొక్క దిగువ భాగంలో శిబిరములు ఏర్పరచుకొని నివసించుచుండిన సమయంలో దేవుడు ఇలా పలికాడు:

> నేను ఐగుప్తీయులకు ఏమి చేసితినో, మిమ్మును గద్ద రెక్కలమీద మోసి నా యొద్దకు మిమ్మునెట్లు చేర్చుకొంటినో మీరు చూచితిరి. కాగా మీరు నా మాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడిచినయెడల మీరు సమస్తదేశ జనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు. సమస్త భూమియు నాదేగదా. మీరు నాకు యాజక రూపకమైన రాజ్యముగాను పరిశుద్ధమైన జనముగాను ఉందురని చెప్పుము (నిర్గమ 19:4-6).

ఇశ్రాయేలు పన్నెండు గోత్రాలను గూర్చి దేవుడు పలికిన మాటలను గమనించండి. ఇశ్రాయేలు "యాజక రూపకమైన రాజ్యముగాను, పరిశుద్ధమైన జనముగాను" ఉండాలి. మనమిదివరకు చూచినట్టుగా, వారు "పరిశుద్ధ జనమై" యుండాలి, అనగా ప్రత్యేకమైన, వేరుపరచబడిన, ఇతర ప్రజలందరి నుండి ప్రత్యేకింపబడినవారై యుండాలి. కాని మరి ఎక్కువ ఖచ్చితంగా చెప్పుకొంటే, వారు "యాజక రూపకమైన రాజ్యము" లేక, ఒక యాజకత్వ రాజ్యమై యుండాలి.

ఆదిలోనే ఆదాము మరియు హవ్వ కుండిన రెండింతల పాత్రను ఇశ్రాయేలు నెరవేర్చుచుండినదని యాజక రూపకమైన రాజ్యము అని ఇశ్రాయేలుకు పెట్టబడిన ఈ పేరు తెలియజెప్పుచున్నది. ఆదాము మరియు హవ్వ దేవుని రాజులైన యాజకత్వ పరిచర్య చేయడానికి పిలువబడినారనే విషయాన్ని మనము జ్ఞాపకము చేసుకొనవచ్చు. ఇశ్రాయేలు గోత్రములు కూడా దేవుని సామ్రాజ్యవాద యాజకులై యుండుటకు పిలువబడినవని ఇక్కడ మనము గమనిస్తున్నాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

### యాజకులు మరియు రాజులు

మూడవది, దేవుని రాజ్యము కొరకు ఇశ్రాయేలు ఒక జనాంగముగా రాజులైన యాజక సమూహమై యుండు ప్రత్యేకార్హత కలిగియుండినది, అయినప్పటికిని, వారు బలమైన ఒక జనాంగముగా అభివృద్ధిచెందుచుండిన కొలది కొందరు ఇశ్రాయేలీయులు ప్రత్యేకాధికారముగల యాజకుడు మరియు రాజు అయ్యుండు హోదా కల్పింపబడిందనే విషయాన్ని కూడా మనము గమనించాలి. సాధారణ అవగాహన చొప్పున, ఇశ్రాయేలు జనాంగము మొత్తం దేవుని ప్రత్యేకమైన యాజకుల రాజ్యముగా పరిశుద్ధపరచబడింది. కాని యాజకులుగాను రాజులుగాను ఆయనను సేవించుట ద్వారా వారు ఆయన యొక్క అత్యంత ప్రత్యేకమైన పోలికెలై యుండాలని, చివరకు దేవుడు ఇశ్రాయేలులో ఉండే కొందరు నిర్దిష్టమైన ప్రజలను మరియు కుటుంబాలను ఎంపిక చేసుకున్నాడు, గనుక వారు దేవునికి పరిశుద్ధ సేవలనందించునట్లు ఇది ఈ జనాంగమును నడిపించింది.

నిర్గమకాండము మనకు తెలియజేయుచున్నట్టుగా, అహరోను మరియు అతని సంతానము దేవుని యాజకులుగా ఆయనను సేవించవలసిన వారిగా ఉండిరి. వారు ప్రాథమికంగా ప్రజలను గుడారము మరియు ఆలయములోని దేవుని ప్రత్యేక సన్నిధిలోనికి నడిపిస్తూ, ఆరాధనలు, బలియాగములు మరియు స్తుతులనర్పించిరి. ఆ తరువాత, దేవుని ప్రజలకు రాజులుగా తమ సేవలనందించడానికి దావీదు మరియు అతని సంతానము అభిషేకింపబడ్డారు. వారు దేవుని యొక్క ప్రత్యేక పరిచారకుల వలె ఎక్కువగా దేశము యొక్క రాజకీయ కోణాలలో పనులు చేశారు.

పాత నిబంధన ఇశ్రాయేలు యొక్క స్థలము మరియు రాజ్యసంబంధులైన ప్రజలను గూర్చి తెలుసుకున్నాము కాబట్టి, ఇప్పుడు ఈ కాలములో ఆ రాజ్యము పురోభివృద్ధి చెందిన విషయాన్ని కొంతసేపు అధ్యయనం చేద్దాము.

## పురోభివృద్ధి

విచారకరంగా, ఇశ్రాయేలు చరిత్ర ఎక్కువగా ప్రాచీన కాలము వంటిదై యున్నది. అది నిర్మాణాత్మకమైన గట్టి సాధింపులు మరియు అంతులేని వైఫల్యాల మిశ్రమమైయున్నది. దేవుని రాజ్యము పురోగమించింది, కాని మానవుల పాపిష్టితనమునుబట్టి, ఈ పురోగమనములు ఆశించిన అంతిమ లక్ష్యమును సాధించలేదు; దేవుని రాజ్యమును భూదిగంతముల వరకు వ్యాపింపజేయలేదు.

బైబిలు సంబంధమైన ఈ చరిత్ర కాలము సుదీర్ఘమైనది మరియు సంక్లిష్టమైనది గనుక మనము కొన్ని ప్రధానాంశములను మాత్రమే చూద్దాము. ఈ కాలములో కొనసాగిన రాజ్యము యొక్క పురోభివృద్ధిలోని మూడు దశలను గూర్చి చెప్పుకుందాము: మొదటిది, వాగ్దాన దశ; రెండవది, నిర్గమము మరియు విజయము; మూడవది, ఇశ్రాయేలు ఒక సామ్రాజ్యముగా నెలకొనియుండిన కాలము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## వాగ్దానము

మొదట, వాగ్దాన కాలమును గూర్చి మనము మాట్లాడదాము. ఇశ్రాయేలు పితరుల కాలమును గూర్చిన తలంపు మన మనస్సులో ఉన్నది. అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు మరియు పన్నెండు మంది ఇశ్రాయేలు గోత్రముల కాలములో, ఇశ్రాయేలు భవిష్యత్తును గూర్చి దేవుడు అనేక వాగ్దానములు చేశాడు. ప్రాథమికంగా, ఈ వాగ్దానాలను రెండు వర్గములుగా విభజింపవచ్చు: మొదటిది, సంఖ్యాపరంగా హెచ్చగుచుండుటను గూర్చిన వాగ్దానములు; రెండవది, పెత్తనం చెలాయించుటను గూర్చిన వాగ్దానములు.

వారు ఫలించి అభివృద్ధిపొందుచు దేవుని పోలికెలను విస్తరింపవలెనని దేవుడు ఆదాము మరియు హవ్వను పిలిచినట్టుగానే, అతని సంతానము లెక్కింపశక్యము కానంతగా విస్తరించునని దేవుడు అబ్రాహామునకు వాగ్దానమిచ్చాడు. ఆది. 15:5లో దేవుడు అబ్రాహామునకిచ్చిన గొప్ప వాగ్దానమేమిటో చూడండి:

> నీవు ఆకాశమువైపు తేరిచూచి నక్షత్రములను లెక్కించుటకు నీ చేతనైతే లెక్కించుమని చెప్పి నీ సంతానము ఆలాగవునని చెప్పెను (ఆది. 15:5).

మనమిదివరకు తెలుసుకొన్నట్టు, మానవ జాతికి మార్గదర్శకంగా ఉంటూ, దేవుని స్వరూపులైయుండు పాత్రను అది నెరవేర్చునట్లు నడిపించడానికి అబ్రాహాము మరియు అతని సంతానము ఏర్పరచుకొనబడ్డారు. విమోచింపబడిన మానవులు నక్షత్రముల వలె లెక్కింపలేనంతటి సంఖ్యలో ఉండునట్లు పరిశుద్ధ సంతానము విస్తరించుట ద్వారా కొంత మేరకు ఇది జరగాల్సి ఉంటుంది. అందు చేతనే ఇస్సాకు, శారా ద్వారా అబ్రాహామునకు జన్మించిన అద్భుతకరమైన పుత్రుని జన్మము అంత ఎక్కువగా నొక్కివక్కాణింపబడుతుంది. బైబిలు సంబంధమైన కథ దాని దృష్టిని ఇస్సాకు కుమారుడు యాకోబు మరియు యాకోబు యొక్క పన్నెండు మంది కుమారులపై కేంద్రీకరించుటకు కూడా ఇదే హేతువై యున్నది. దేవుని ప్రజలు, వాగ్దాన సంబంధమైన ఈ ఆదిమ కాలములోనే, పాత నిబంధనలో అదివరకే విస్తరించుచుండిరి. అందుకే ఇశ్రాయేలు జనాంగములోని విమోచింపబడిన దేవుని పోలికెల విస్తరింపు పాత నిబంధన యందంతటను ఒక ప్రధానాంశమైయున్నది.

దీనిని మించి, పితరులను గూర్చిన బైబిలు సంబంధమైన కథలు కూడా వాటి దృష్టిని పెత్తనం చెలాయించుటను గూర్చిన వాగ్దానముపై కేంద్రీకరిస్తున్నాయి. దేవుడు అబ్రాహామునకు లెక్కింపశక్యముకాని సంతానము నిచ్చుటను గూర్చి మాత్రమే కాదు, కాని అతని సంతానము పరిశుద్ధమైన కనాను దేశమును స్వాధీనం చేసుకొందురని కూడా వాగ్దానం చేశాడు. ఆది. 15:7లో ఇలా వ్రాయబడియున్నది:

> మరియు ఆయన నీవు ఈ దేశమును స్వతంత్రించుకొనునట్లు దాని నీకిచ్చుటకు కల్దీయుల ఊరను పట్టణములోనుండి నిన్ను ఇవతలకు తీసికొని వచ్చిన యెహోవాను నేనే అని చెప్పినప్పుడు . . . (ఆది. 15:7).



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

వారు భూమిని లోపరచుకొని ఏలవలసిందని దేవుడు ఆదాము మరియు హవ్వకు సెలవిచ్చినట్టుగానే, ఆయన యొక్క ప్రత్యేక ప్రజలైన, ఇశ్రాయేలు, వాగ్దాన దేశాన్ని లోపరచుకొని, ఏలుచు, దానియందు శ్రేయోభివృద్ధిని అనుభవించుదురని ఆయన వాగ్దానం చేశాడు.

అందుచేతనే, తన కుటుంబము పాతిపెట్టబడుటకు పనికివచ్చునట్లు అబ్రాహాము కనాను దేశంలో చిహ్నాత్మకమైన ఒక చిన్న స్థలాన్ని కొనుగోలు చేశాడు. ఇంకా, వాగ్దాన దేశాన్ని యాకోబు కొంత కాలము వరకు విడిచిపెట్టి వెళ్లిపోయినప్పటికిని, అపాయకరమైన పరిస్థితి తన ఎదుట ఉన్నదని తెలిసినను ఎందుకు తిరిగివచ్చాడో ఇది వివరిస్తుంది. ఇంకా, వారు ఐగుప్తు దేశాన్ని వదిలిపెట్టి వాగ్దానము చేయబడిన దేశానికి తిరిగి వెళ్లుదురని పలుకుతూ, యోసేపు తన అవసానకాల మాటల్లో ఇశ్రాయేలీయులకు ఎందుకు అభయమిచ్చాడో కూడా ఇది వివరిస్తుంది. పితరుల కాలము, ఆయన వారిని విస్తరింపజేసి ఆయన రాజ్యమును వ్యాపింపజేయు ప్రజగా వారికి పాత నిబంధన ఇశ్రాయేలుపై ఏలుబడితో కూడిన అధికారమును అనుగ్రహించునని దేవుడు వాగ్దానము చేసిన కాలమై యుండినది.

## నిర్గమము మరియు విజయము

నిర్గమము మరియు విజయమును గూర్చిన కాలము, పాత నిబంధన ఇశ్రాయేలు చరిత్రలో, దేవుని రాజ్యము భూమి మీద వచ్చుటకు సంబంధించిన రెండవ ప్రధాన దశయై యున్నది. ఈ కాలములో దేవుడు ఇశ్రాయేలుతో చేసిన కార్యము భూమి మీద ఆయన రాజ్యమును స్థాపించుటకు ఉద్దేశింపబడినదని ప్రత్యేకించి ఒక వాక్యభాగము సువిదితం చేస్తున్నది. నిర్దిష్టంగా, మోషే మరియు ఇశ్రాయేలీయులు ఎర్ర సముద్రము గుండా వెళ్లినప్పుడు, వారు సుప్రసిద్ధమైన ఒక పాట పాడారు, అది నిర్గమ. 15:1-18 వచనాలలో ఉన్నది. దేవుని ఏలుబడిని గూర్చిన ప్రధానాంశము ఇంత విదితంగా విశదీకరింపబడిన లేఖనములలోని మొదటి వాక్యభాగము ఇదే. ఈ పాటలో రాజ్యమునకు సంబంధించిన అద్భుతకరమైన ప్రధానాంశములు అనేకమున్నాయి కాని మనము ఒక్క దానిని మాత్రమే పేర్కొందాము. భవిష్యత్తు విషయమై మోషే కలిగియుండిన ఆత్మస్థైర్యమును గూర్చిన మాటలను మనము నిర్గమ. 15:13లో చదవవచ్చు:

> నీవు విమోచించిన యీ ప్రజలను నీ కృపచేత తోడుకొనిపోతివి. నీ బలముచేత వారిని నీ పరిశుద్ధాలయమునకు నడి పించితివి (నిర్గమ. 15:13).

దేవుడు ఇశ్రాయేలీయులను తన పరిశుద్ధ నివాసమునకు నడిపించాడు గనుక వారు ఆయనను స్తుతించారనే విషయాన్ని గమనించండి. మనమిదివరకే చూచినట్టు, ఏదెను వలెనే, వాగ్దానము చేయబడిన దేశం భూమి మీద దేవుని ప్రత్యేక పరిశుద్ధ సన్నిధిగల కేంద్రమైయుండాలి. కాని “తోడుకొనిపోవుట” అని అనువదింపబడిన *nahal (נָהַל)* అనే హెబ్రీ పదము, ఎక్కువ అక్షరార్థంతో గొర్రెల కాపరి అని అనువదింపబడవచ్చు అనే విషయాన్ని మనము దీని కంటే ఎక్కువగా గుర్తించాలి. కాయుట అనే ఈ



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అలంకారము సర్వసాధారణంగా ప్రాచీన పశ్చిమ ఆసియలోని మరియు బైబిలులోని రాజుల కార్యకలాపములను గూర్చిన ఒక సామాన్య వర్ణనయై యున్నది. దేవుడు తన ప్రజలను వారి రాజైన కాపరిగా ఆయన పరిశుద్ధ నివాస స్థలమునకు తోడుకొనివెళ్లుచుండెను.

దేవుని రాజరిక మరియు రాజ్యమును గూర్చిన ప్రధానాంశము వారు ఎర్ర సముద్రము యెదుట పాడిన పాట చివరలో నిర్గమ. 15:17-18లో కనబడుతుంది.

> నీవు నీ ప్రజను తోడుకొని వచ్చెదవు యెహోవా, నీ స్వాస్థ్యమైన కొండమీద నా ప్రభువా,
> నీవు నివసించుటకు నిర్మించుకొనిన చోటను నీ చేతులు స్థాపించిన
> పరిశుద్ధాలయమందు వారిని నిలువ పెట్టెదవు. యెహోవా నిరంతరమును ఏలువాడు
> (నిర్గమ. 15:17-18).

ఈ వచనములను బట్టి చూస్తే, దేవుడు ఇశ్రాయేలును ఒక పరిశుద్ధ పర్వతమునకు, అనగా మనకు బైబిలు అటు తరువాత బయలుపరచు ఒక పవిత్ర స్థలమైన యెరూషలేమునకు తోడుకొని వెళ్లుచుండెను. పర్వతమందున్న ఈ పవిత్ర స్థలము యొక్క స్వభావం ఏమైయుండాలి? మొదటిదిగా, అది దేవుని "నివాస స్థలమని" మోషే చెప్పాడు. మరొక పర్యాయం, "నివాస స్థలము" అని అనువదింపబడిన *yashav* (יָשַׁב) అనే హెబ్రీ పదము, తరచుగా "ఒక రాజు యొక్క పట్టాభిషేకమును" సూచిస్తుంది. ఆ వాక్యభాగములోని ప్రధాన రాజ భావముల దృష్ట్యా, పరిశుద్ధ పర్వతమనేది దేవుని సింహాసనారోహణ స్థలమై యుంటుందని అర్థం చేసుకొనడం ఉత్తమం.

ఈ కారణాన్ని బట్టే వచనము 18 వెంటనే విశదమైన రాజ పదజాలముతో దేవుని ఇలా స్తుతించుచున్నది:

> యెహోవా నిరంతరమును ఏలువాడు (నిర్గమ. 15:18).

ఇశ్రాయేలు జనాంగమును వాగ్దాన దేశములోనికి తోడుకొని వెళ్లిన కాపరియై యుంటూ దేవుడు దాని రాజుగా తన చర్యను చేపట్టాడు, మరియు వారిని తన రాజ సింహాసనమును చుట్టుముట్టియుండు జనాంగముగా స్థిరపరచవలెనని ఆ సమయంలో ఆయన ఉద్దేశించాడు. అనగా, దేవుడు ఏలుబడిని, ఆయన రాజత్వమును, భూమి మీద ఆయన రాజ్యము నిరంతరము నిలుచునట్లు స్థాపించాలనేది నిర్గమము మరియు విజయము యొక్క ఉద్దేశమై యుండినదని మరొక మాటలో చెప్పుకొనవచ్చు.

## సామ్రాజ్యము

పాత నిబంధన ఇశ్రాయేలు ప్రాముఖ్యతను గూర్చిన కాలములోని దేవుని రాజ్యము యొక్క మూడవ దశను సామ్రాజ్య దశ, అనగా ఇశ్రాయేలు, ఒక రాజు మరియు ఆలయము కలిగియుండిన జనాంగముగా



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

సుస్థిరంగా స్థాపింపబడి యుండిన కాలమని చెప్పుకొనవచ్చు. దురదృష్టవశాత్తు, ఇశ్రాయేలు కొరకు దేవుని ప్రణాళిక ప్రకారమైన మానవ రాజుల చోటు కొంత వివాదాస్పదమైన విషయమైయున్నది. ఇశ్రాయేలునకు మానవ రాజొకడుండాలని దేవుడు ఎల్లప్పుడు ఆశించాడనియు, ఇశ్రాయేలులో రాజరికము అభివృద్ధి చెందిన విధానమును గూర్చిన వాస్తవాన్ని మనము తరువాత పాఠంలో జాగ్రత్తగా చూద్దాము. అయితే ప్రస్తుతానికి దేవుడు దావీదును మరియు అతని కుమారులను తన ప్రజలపై రాజులనుగా స్థాపించాలని నిశ్చయించుకొనగానే ఆయన రాజ్యము ముందుకు కొనసాగిన విధానాన్ని మాత్రమే చూద్దాము.

దావీదు మరియు అతని కుమారుడు సొలొమోను యెరూషలేమును రాజు మరియు ఆలయముండిన స్థలంగా స్థాపించడం ద్వారా దేవుని రాజ్యమును భూమి మీద ముందుకు తీసుకొని వెళ్లారు. మరొక ప్రక్క యెరూషలేములో దావీదు సింహాసనము స్థాపించబడుట, భూమి మీద దేవుని ఏలుబడికి ప్రతినిధులుగా నుండి రాజ కుటుంబము స్థాపింపబడుటయే అయ్యింది. 1 దిన. 29:23లో దావీదు కుటుంబము యొక్క సింహాసనము ఈ విధంగా వర్ణింపబడింది:

> అప్పుడు సొలొమోను తన తండ్రియైన దావీదునకు మారుగా యెహోవా సింహా
> సనమందు రాజుగా కూర్చుండి వర్ధిల్లుచుండెను (1 దిన. 29:23).

దావీదు సింహాసనము ప్రభువు యొక్క సింహాసనమై యుండినది. దావీదు యొక్క రాజ కుటుంబము దేవుని రాజత్వ అధికారమునకు ప్రతినిధులుగా నిలుస్తూ ఇశ్రాయేలు ప్రజలను నడిపించింది. దావీదు మరియు అతని కుమారులు దేవుని ఇతర స్వరూపులను నడిపించుట ద్వారా హెచ్చింపబడిన దేవుని పోలికెలుగా ఉన్నతమైన అధికారపూర్వక పాత్ర వహించారు.

మరొక ప్రక్క దావీదు సిద్ధపరచిన దేవాలయమును సొలొమోను నిర్మించాడు, మరియు దీనిని బైబిలు సాధారణంగా దేవుని "మందిరము" లేక దేవుని "రాజ భవనము" అని సూచిస్తుంది. ఇశ్రాయేలు జనాంగమును, దేవునికి ఆరాధనాసహితమైన సేవలుచేయు రాజులైన యాజక సమూహముండిన జనాంగమును, నడిపించువారుగా యాజకులు ఈ ఆలయములో నెలకొల్పబడిరి. దావీదు యెరూషలేమునకు తీసికొని వచ్చిన నిబంధన మందసమును సొలొమోను దేవాలయము మధ్యలో ఉంచాడు. నిబంధన మందసమును గూర్చిన ప్రతీకవాదము అత్యంత ప్రాముఖ్యమైన విషయం. దావీదు ప్రకారం, నిబంధన మందసము దేవుని పాదపీఠం. 1 దిన. 28:2లో ఇలా వ్రాయబడియున్నది:

> యెహోవా నిబంధన మందసమునకును మన దేవుని పాదపీఠమునకును
> విశ్రమస్థానముగా ఉండుటకు ఒక మందిరము కట్టించ వలెనని నేను నా
> హృదయమందు నిశ్చయము చేసికొని సమస్తము సిద్ధపరచితిని (1 దిన. 28:2).



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

దేవుని సింహాసనము పరలోకమందుండినది కాని ఆయన సింహాసనము యొక్క పాదపీఠము యెరూషలేములోని దేవాలయమందుండిన నిబంధన మందసమై యుండినది. నిజానికి, సొలొమోను యెరూషలేము దావీదు కుటుంబము కొరకు ఒక ముఖ్య పట్టణముగా, దేవుని కొరకే ఉద్దేశింపబడిన రాజత్వ పవిత్ర స్థలంగా మార్చాడు.

కాబట్టి, దావీదు మరియు సొలొమోను కాలము నాటికి, అబ్రాహాము దినములలో సంచరించుచుండిన జాతిగా ఉండిన ఇశ్రాయేలు, నిర్గమము మరియు విజయము ద్వారా స్థాపింపబడిన జనాంగమయ్యిందనియు, చివరకు సామ్రాజ్య నగరమైన యెరూషలేము పట్టణంలో ఒక రాజు మరియు ఒక దేవాలయముగల ఒక సామ్రాజ్యమయ్యిందనియు మనము గమనిస్తున్నాము. దేవుని రాజ్యము ఇశ్రాయేలు జనాంగములో స్థాపింపబడుచుండినది.

అలాగైతే, ఇశ్రాయేలును ఒక సామ్రాజ్యంగా నిర్మించుటలో గల నిరీక్షణ, ఉద్దేశం ఏమై యుండినది? ఇశ్రాయేలు యొక్క మానవ రాజు ద్వారా, దేవుని ప్రత్యేకమైన పరిచారకుడైన రాజై యుండిన వాని ద్వారా, దేవుని ఏలుబడి భూదిగంతముల వరకు వ్యాపించునట్లు దేవుడు తన ప్రజలను ఆ యా దశల గుండా నడిపించాడు అని ఒక్క మాటలో చెప్పుకొనవచ్చు. ఈ గమ్యమును గూర్చి కీర్తనకారుడు కీర్తనలు 72:1-17లో ఈ విధంగా వ్యక్తం చేస్తున్నాడు:

> దేవా, రాజునకు నీ న్యాయవిధులను రాజకుమారునికి నీ నీతిని తెలియజేయుము . . . సముద్రమునుండి సముద్రము వరకు యూఫ్రటీసు నది మొదలుకొని భూదిగంతములవరకు అతడు రాజ్యము చేయును . . . రాజులందరు అతనికి నమస్కారము చేసెదరు. అన్యజనులందరు అతని సేవించెదరు . . . అతని పేరు నిత్యము నిలుచును అతని నామము సూర్యుడున్నంత కాలము చిగుర్చుచుండును. అతనినిబట్టి మనుష్యులు దీవింపబడుదురు అన్యజనులందరును అతడు ధన్యుడని చెప్పుకొందురు (కీర్తనలు 72:1, 8, 11, 17).

ఇందులో మనము అనేక ముఖ్యాంశాలను చూడవచ్చు. మొదటిది, దావీదు కుటుంబము దీవింపబడాలని కీర్తనకారుడు ప్రార్థించాడు మరియు దావీదు వంశము నీతి మరియు న్యాయమును లక్షణములు గలదై యుండాలి. అయితే ఇది దావీదు ఏలుబడిని అతి విస్తారంగా విస్తరింపజేస్తుందని అతనికి తెలుసు. దావీదు కుటుంబము భూదిగంతముల వరకు ఏలుతుంది; అతడు సముద్రము నుండి సముద్రము వరకు పరిపాలన చేస్తాడు, రాజులందరు, అన్యజనులందరు దావీదు సింహాసనముపై ఆసీనుడై యుండువానిని సేవిస్తారు, ఏలయనగా అతడు దేవుని నీతి న్యాయములకు ప్రతినిధియై యున్నాడు. దేవుని ప్రత్యేక దాసుని ఏలుబడి, ఇశ్రాయేలు రాజు పరిపాలన, దేవుని ఏలుబడిని భూదిగంతముల వరకు విస్తరింపజేస్తుంది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

కాని దేవుని రాజ్యమును గూర్చిన ఈ విస్తరింపు ఎందుకు జరుగుతుంది? దాని లక్ష్యమేమిటి? అవును, దేవుడు ఇశ్రాయేలును ఏర్పరచుకొనుటలోగల ఆరంభ ఉద్దేశం నెరవేర్చాలనేది ఇశ్రాయేలు చరిత్రను గూర్చిన సామ్రాజ్య దశ యొక్క ఉద్దేశమైయుండిందని 72వ కీర్తన ఆశ్చర్యకరమైన రీతిలో ప్రకటిస్తుంది. ఆది. 12:3 ప్రకారం, దేవుడు అబ్రాహామును ఆయన కొరకే పిలిచినప్పుడు ఆయన తన మనస్సులో ఒక లక్ష్యమును కలిగియుండెనని నీవు జ్ఞాపకం చేసుకొనవచ్చు. అదేమనగా:

> . . . భూమి యొక్క సమస్త వంశములు నీయందు (అబ్రాహామునందు) ఆశీర్వదింపబడును (ఆది. 12:3).

అయితే అబ్రాహామునకియ్యబడిన ఈ వాగ్దానం ఎలా నెరవేరుతుంది? కీర్తనలు 72:17ను మరొక పర్యాయం చూడండి. దావీదు కుటుంబము యొక్క నీతి న్యాయముగల ఏలుబడి ద్వారా:

> మనుష్యులు దీవింపబడుదురు. అన్యజనులందరును అతనిని ధన్యుడని చెప్పుకొందురు (కీర్తనలు 72:17).

ఆది. 12:3కు సంబంధించిన సూచన స్పష్టంగా ఉన్నది. అబ్రాహామును ఏర్పరచుకొనుటలో గల దేవుని లక్ష్యము చివరకు దావీదు కుటుంబము దేవుని దీవెనలను సమస్త జనాంగములకు విస్తరింపజేసినప్పుడు నెరవేరుతుంది.

చివరిగా, దావీదు వంశములో ఇశ్రాయేలు యొక్క ఆరంభ ఉదేశం నెరవేరుట వలన కలిగిన పరిణామమేమై యుండినది? అనే ప్రశ్న మనలను మనము అడుగుకోవాలి. అబ్రాహాము దీవెనలను దావీదు కుటుంబము లోకమంతటికి ఎందుకు విస్తరింపజేసింది? దేవుని మహిమాన్వితమైన ఏలుబడి భూదిగంతముల వరకు విస్తరించుట దాని పరిణామమై యుంటుందని ఒక్క మాటలో చెప్పుకొనవచ్చు. అందుకే కీర్తనలు 72 ప్రతిధ్వనిస్తున్న దేవుని స్తుతిగానముతో 19వ వచనంలో ఇలా ముగియుచున్నది:

> ఆయన మహిమగల నామము నిత్యము స్తుతింపబడును గాక సర్వభూమియు ఆయన మహిమతో నిండియుండును గాక. ఆమేన్. ఆమేన్ (కీర్తనలు 72:19).

కీర్తనలు 72లో ఈ ముగింపు వచనము, పితరులకియ్యబడిన వాగ్దానములు మొదలుకొని నిర్గమము మరియు విజయము ద్వారా సామ్రాజ్యమునకు ఇశ్రాయేలుతో చోటుచేసుకొన్న సమస్త పురోగమనముల కొరకైన చిట్టచివరి లక్ష్యమును వెల్లడిస్తుంది. భూదిగంతములను దేవుని మహిమతో నింపడానికే రాజ్యమును గూర్చిన ఈ దశలన్నీ ఉద్దేశింపబడినవి. దేవుని రాజ్యము ఇశ్రాయేలు సరిహద్దుల నుండి భూదిగంతముల వరకు కుటుంబము యొక్క ఏలుబడి ద్వారా విస్తరించుచుండగా, దేవుని మహిమాన్వితమైన సన్నిధి పరలోకమును నింపినట్టుగానే లోకమంతటిని నింపుతుంది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ప్రాచీన చరిత్ర మరియు పాత నిబంధన ఇశ్రాయేలు చరిత్రలోని దేవుని రాజ్యమును గూర్చిన నేపథ్యాన్ని మనము తెలుసుకొన్నాము, గనుక ఇక చివరి అంశాన్ని చూద్దాము: క్రొత్త నిబంధనలో దేవుని రాజ్యము. క్రీస్తు అనుచరులముగా, పాత నిబంధనను ఈనాడు సరిగా అన్వయించుకొనగోరుతున్నట్లయితే, దేవుని రాజ్యమును గూర్చిన క్రొత్త నిబంధన యొక్క దృష్టికోణాలను మనము అర్థంచేసుకోవాలి.

## క్రొత్త నిబంధన

క్రైస్తవులంతా ఏకీభవించే ఒక విషయమున్నట్లయితే, అది యేసు సందేశంలోని ప్రధానాంశం, క్రొత్త నిబంధన అంతటి ప్రధానాంశం, సువార్తయై యున్నదనేదే. కాని క్రొత్త నిబంధన సువార్త, లేదా క్రీస్తును గూర్చిన సువర్తమానము, దేవుని రాజ్యమును గూర్చిన పాత నిబంధన యొక్క ప్రధానంశము నెరవేరుటయని తరచుగా మనము తెలుసుకోము. మత్తయి 4:23లో యేసు బోధను మత్తయి క్రోడీకరించిన విధానమును గమనించండి:

> యేసు వారి సమాజమందిరములలో బోధించుచు, (దేవుని) రాజ్యమును గూర్చిన సువార్తను [లేక సువర్తమానమును] ప్రకటించుచు, ప్రజలలోని ప్రతి వ్యాధిని, రోగమును స్వస్థపరచుచు గలిలయయందంతట సంచరించెను (మత్తయి 4:23).

యేసు సువార్తను లేక సువర్తమానమును ప్రకటించాడు. అయితే ఈ సువర్తమానమేమై యున్నది? అది దేవుని రాజ్యమును గూర్చిన సందేశమైయున్నది. ఈ కారణాన్ని బట్టే, మనము నమ్మి ఇతరులతో పంచుకొనుచున్న సువార్తను గూర్చిన మన గ్రహింపు, క్రొత్త నిబంధన యొక్క ప్రధానాంశమే, దేవుని రాజ్యమును గూర్చిన మన అవగాహనపై ప్రత్యక్షంగా ఆధారపడియున్నది.

క్రొత్త నిబంధనలో గల దేవుని రాజ్యమును గూర్చిన ప్రధానాంశమును మనము బైబిలు సంబంధమైన చరిత్ర దశలో చూసినట్టుగా మూడు విషయాలుగా అన్వేషిద్దాము. మొదట, రాజ్యము యొక్క స్థలమును గూర్చి క్రొత్త నిబంధన తెలియజేస్తున్న విషయం. రెండవది, దేవుని రాజ్య సంబంధులను గూర్చి మాట్లాడదాము. మూడవది, క్రొత్త నిబంధన కాలములోని రాజ్యము యొక్క పురోభివృద్ధిని గూర్చి మాట్లాడదాము. మొదటిగా, క్రొత్త నిబంధనలోని రాజ్యము యొక్క స్థలమును చూద్దాము.

### స్థలము

అనేక విధాలుగా క్రొత్త నిబంధన, దేవుని రాజ్యము యొక్క స్థలము పట్ల మనము పాత నిబంధనలో చూచే అదే ఉన్ముఖత కలిగియున్నది. మొదటిగా, దేవుని రాజ్యము యొక్క కేంద్రం ఇశ్రాయేలు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

దేశమైయుండినదని అది సూచిస్తుంది, మరియు రెండవదిగా, దేవుని రాజ్యము భూదిగంతముల వరకు విస్తరించాల్సి ఉండినదని అది ఉపదేశిస్తుంది. మొదట, క్రొత్త నిబంధన దినములలో ఇశ్రాయేలులో రాజ్యము ఉండిన స్థలమును చూద్దాము.

## కేంద్రము

క్రొత్త నిబంధనలోని దేవుని రాజ్యము ఇశ్రాయేలులో కేంద్రీకృతమై యున్నదని మనము కనుగొన్నట్లయితే, మనము ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. పాత నిబంధనలో పలుమార్లు పునరావృతమైనట్లు మనము చూచిన నమూనా ఇదే. ఆదియందు దేవుని రాజ్యము భూమి మీద ఏదెను తోటలో కేంద్రీకృతమై యుండినది. ఆ తరువాత, దేవుని రాజ్యమును నిర్మించడానికి ఇశ్రాయేలు జనాంగగము మోషే నాయకత్వాన ఏదెను తోటకు తిరిగి వచ్చింది. కాబట్టి, దేవుని రాజ్యమును గూర్చిన క్రొత్త నిబంధన దశ ఆరంభమైనప్పుడు, ఈ రాజ్యము మరొక పర్యాయం ఇశ్రాయేలు దేశంలో ఆరంభమయ్యింది.

ఇశ్రాయేలు దేశం క్రొత్త నిబంధనలోని దేవుని రాజ్యానికి భౌగోళికంగా కేంద్ర స్థానమైయున్నదని గమనించడం అంత కష్టమేమి కాదు. మనకందరికి తెలిసినట్టుగానే, యేసు పుట్టిపెరిగింది, తన అపొస్తులులను పోగుచేసుకొన్నది, పరిచర్య చేసింది, మరణించింది, పునరుత్థానుడయ్యింది, మరియు పరలోకమునకు ఆరోహణుడయ్యింది ఇశ్రాయేలులోనే. యేసు బాల్యములో ఐగుప్తులో గడిపిన కొంత కాలమును మినహాయిస్తే, ఆయన తన జీవితకాలమంతటిని వాగ్దానము చేయబడిన భూభాగంలోనే గడిపాడు.

క్రొత్త నిబంధనలో సహితం దేవుని రాజ్యము ఎందుకు వాగ్దానము చేయబడిన భూభాగంలోనే కేంద్రీకృతమై యుండినదో తెలుసుకొనుటకు, ఈ కాలములోని దేవుని ప్రజల పరిస్థితిని జ్ఞాపకం చేసుకొనడం సహాయపడుతుంది. దేవుడు పాత నిబంధనలో ఇశ్రాయేలు జనాంగమును ఆశీర్వదించాడు. మన పితరుల దినములలో దేవుడు వారిని సగం-దేశ సంచారులు వంటి మనుగడతో వారొక జీతీయతగా ఏర్పడునట్లు మోషే మరియు యెహోషువ నాయకత్వంలోను, ఆ మీదట ముఖ్య పట్టణం గల సామ్రాజ్య మహిమకును, ఒక నిర్దిష్ట స్థలము మరియు దేవాలయముగల చోటికి దావీదు మరియు సొలొమోను నాయకత్వంలోను తోడుకొని వచ్చాడు. భూమి మీద దేవుని ఏలుబడి విషయంలో ఇవి గొప్ప పురోగమనములై యుండినవి. కాని మనకు పాత నిబంధన తెలియజేయుచున్నట్టు, పరిశుద్ధ ప్రదేశములో నుండి తన ప్రజలను నిర్వాసితులనుగా చేసిన దీవెనకరమగు దినములలో ఇశ్రాయేలీయులు దేవునికి విరోధంగా బహు తీవ్రంగా తిరుగుబాటు చేశారు. యేసు కాలము నాటికి, ఇశ్రాయేలు ప్రజలు నిర్వాసితులుగా చేయబడ్డారు, చెదిరిపోయారు, అన్యమత సామ్రాజ్యాల చేత అనగా, అష్షూరీయులు, బబులోనీయులు, మాదీయులు, పారసీకులు, గ్రీకులు మరియు రోమీయుల చేత నాలుగు వందల సంవత్సరాల వరకు నిరంకుశంగా పాలింపబడ్డారు.

ఈ విషయాన్ని నేటి క్రైస్తవులు తెలుసుకొనకపోయినప్పటికీ, ఈ దేశ బహిష్కరణను అంతం చేయడానికే యేసు భూమి మీదకు వచ్చాడు. దేవుని ప్రజలలోని నీతిమంతమైన ఒక శేషమునకు పిలుపునియ్యడానికి



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మరియు దేవుని రాజ్యమును పునఃనిర్మించడానికి ఆయన వచ్చాడు. యేసు చేసిన తొలి ప్రసంగములలో ఒకదానిని గూర్చి లూకా 4:17-19లో లూకా రచించిన వివరమును గమనించండి:

> ప్రవక్తయైన యెషయా గ్రంథము ఆయన చేతి కియ్యబడెను; ఆయన గ్రంథము విప్పగా: ప్రభువు ఆత్మ నామీద ఉన్నది బీదలకు సువార్త ప్రకటించుటకై ఆయన నన్ను అభిషేకించెను. చెరలోనున్న వారికి విడుదలను, గ్రుడ్డివారికి చూపును, (కలుగునని) ప్రకటించుటకును నలిగినవారిని విడిపించుటకును, ప్రభువు హితవత్సరము ప్రకటించుటకును ఆయన నన్ను పంపియున్నాడు. అని వ్రాయబడిన చోటు ఆయనకు దొరకెను (లూకా 4:17-19).

యేసు నజరేతులోని సమాజమందిరములో ఉన్నప్పుడు, దేశబహిష్కృతులైనవారు ఒకానొక దినాన వాగ్దానము చేయబడిన ప్రదేశానికి తిరిగి వచ్చెదరని వాగ్దానం చేసిన ఒక ప్రవచనమును యెషయా గ్రంథము 61వ అధ్యాయంలో నుండి చదివాడు. యెషయా ప్రవచనము, "బీదలు," "చెరలోనున్నవారు," "గ్రుడ్డివారు," "నలిగినవారు" అని పేర్కొన్నది — యెషయా 61వ అధ్యాయంలో పేర్కొనబడిన ఈ పదాలన్నీ దేశబహిష్కృతులైయున్న ఇశ్రాయేలీయులను వర్ణించాయి. ఈ ప్రవచనము ఏమి తెలియజేయుచున్నదో గమనించండి — ఎవరో ఒకరు వచ్చి "సువార్తను," "విడుదలను," "చూపు తిరిగి కలుగజేయబడుటను" మరియు "విడిపింపబడుటను" ప్రకటిస్తారు. అన్యజనాంగముల చేత నిరంకుశంగా పాలింపబడినవారికి సువర్తమానము ప్రకటింపబడవలసి యుండినది. ఈ సువర్తమానము ఎవరు నెరవేర్చారు? యేసు లూకా 4:20-21లో ఇలా వ్రాయబడియున్నది:

> ఆయన గ్రంథము చుట్టి పరిచారకునికిచ్చి కూర్చుండెను. సమాజ మందిరములో నున్నవారందరు ఆయనను తేరిచూడగా, ఆయన నేడు మీ వినికిడిలో ఈ లేఖనము నెరవేరినదని వారితో చెప్పసాగెను (లూకా 4:20-21).

వారి నిర్వాసితము అంతము కానున్నదని ఇశ్రాయేలీయులకు సువర్తమానమును ప్రకటించడానికి దేవుడు అభిషేకించినవాడు యేసే.

## విస్తరింపు

క్రొత్త నిబంధనలోని దేవుని రాజ్యము వాగ్దానము చేయబడిన భూభాగము చుట్టూర కేంద్రీకృతమై యున్నదని తెలుసుకొనడం ఎంత ముఖ్యమైయున్నదో, దేవుని రాజ్యము భూదిగంతముల వరకు విస్తరిస్తుందని క్రొత్త నిబంధన ఉద్ఘాటించుటను గమనించడం కూడా అంతే ముఖ్యమైయున్నది. వాస్తవానికి, ఒకానొక దినాన విశ్వవ్యాప్తమైన విస్తరింపును గూర్చిన నిరీక్షణ వాస్తవంగా క్రీస్తునందు నెరవేరుతుందని క్రొత్త



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

నిబంధన ఉపదేశిస్తున్నది. చరిత్రలోని ప్రతి పూర్వ దశ వలెనే, ఆయన రాజ్యమును వాగ్దానము చేయబడిన దేశంలో నుండి భూదిగంతముల వరకు విస్తరింపజేయాలని దేవుడు క్రొత్త నిబంధనలో ప్రణాళికను రచించాడు.

ఈ రాజ్యము సర్వలోకంలో విస్తరింపబడునట్లు వారు ప్రార్థించాలని యేసు తన శిష్యులకు ప్రభువు ప్రార్థనలో నేర్పించాడనే విషయాన్ని మనమిదివరకే తెలుసుకున్నాము. మనము ఈ క్రింది విధంగా ప్రార్థించాలని యేసు మత్తయి 6:10లో మనకు నేర్పించాడు:

> నీ రాజ్యము వచ్చుగాక, నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక (మత్తయి 6:10).

ఈ ప్రధానాంశమును యేసు తన పరిచర్యయందంతటను కొనసాగించాడు. వాస్తవానికి, ఈ విశ్వవ్యాప్త లక్ష్యముపైనే ఆయన తన శిష్యుల దృష్టిని కేంద్రీకరింపజేశాడు. యేసు తన శిష్యులతో చెప్పిన మాటలు మత్తయి 24:14లో ఈ క్రింది విధంగా వ్రాయబడియున్నాయి:

> మరియు ఈ రాజ్య సువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింపబడును; అటుతరువాత అంతము వచ్చును (మత్తయి 24:14).

దేవుని రాజ్యము రాకడ యొక్క సువర్తమానమును గూర్చిన సందేశము సర్వలోకములో వ్యాపించాలి, అప్పుడు యేసు తిరిగి వచ్చును.

రాజ్యము యొక్క స్థలమును గూర్చి క్రొత్త నిబంధనలో గల వివరమును మనస్సులో ఉంచుకొని, ఇప్పుడు మన దృష్టిని క్రొత్త నిబంధనలో రాజ్య సంబంధులైన ప్రజల వైపు మళ్లిద్దాము.

## ప్రజలు

మనమిదివరకే చూచినట్టు, విశ్వవ్యాప్తంగా వ్యాపించియున్న ఆయన రాజ్యము పరలోకమందున్న ఆయన రాజ్యమును ప్రతిబింబించాలని ఆదియందే దేవుడు తన నిర్ణయపూర్వకంగా నియమించాడు. ఇదంతా ఆయన పోలికె ద్వారా అనగా, మానవ జాతి ద్వారా జరగాల్సి ఉండింది. కాని పాపము ప్రవేశించడంతో, మానవ జాతి దాని పాత్రను యిక నెరవేర్చలేకపోయింది. కాబట్టి దేవుడు ఒక ప్రత్యేకమైన ప్రజలను ఏర్పరచుకొని వారు తన కార్యమందు కొనసాగునట్లు వారిని పాపము నుండి విమోచించాడు. ఎట్టకేలకు ప్రత్యేకమైన ఈ ప్రజలు ఇశ్రాయేలు జనాంగమయ్యారు. అటుపిమ్మట పాత నిబంధన చరిత్ర ముందుకు సాగుతుండగా, ఆయన విమోచించిన జనాంగమును రాజ్య సంబంధమైన పనుల్లో నడిపించుటకుగాను దేవుడు ఇశ్రాయేలులోని ప్రత్యేకమైన ప్రజలను, యాజకులను మరియు రాజులను హెచ్చరించాడు. ఇవే విషయాలు క్రొత్త నిబంధనలోను కనబడుతాయి. ఈ విషయాలను గూర్చి క్రొత్త నిబంధన తెలియజేయుచున్న విధానమును అవగాహన



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

చేసుకొనుటకుగాను, మనము ముఖ్యంగా రెండు అంశాలను చూద్దాము: మొదటిది, దేవుని ప్రధానమైన స్వరూపియైన క్రీస్తు; రెండవది, దేవుని విమోచింపబడిన పోలికెలైన క్రీస్తునందలి విశ్వాసులు. దేవుని స్వరూపియైన యేసునకు ఇవ్వబడిన ప్రాముఖ్యమైన స్థానమును గూర్చి మొదట చూద్దాము.

## క్రీస్తు

త్రిత్వములోని రెండవ వ్యక్తి, దేవుని నిత్య వాక్కు శరీరధారియగుటను గూర్చి నేటి ఇవాంజెలికల్ క్రైస్తవులు తరచుగా అల్పమైన అభిప్రాయము కలిగియున్నారనేది విచారకరమైన విషయమే అయినా, అది నిజం. యేసు, దేవుడైయున్నాడని మేము యుక్తంగా రూఢిపరచుచున్నాము గనుక ఆయన యొక్క ప్రత్యామ్నాయ సిలువ మరణము మరియు మృతుల పునరుత్థానమును గూర్చి మేము ఎక్కువగా చెప్పుకొంటాము. కాని పేర్కొనబడిన విషయాలను చేయగలుగునట్లు యేసు శరీరధారియగుటలో గల హేతువును ఆధునిక క్రైస్తవులు అంతంత మాత్రమే అర్థం చేసుకొంటున్నారు. అది సరే, కాని దేవుని రాజ్యములో మానవ జాతి వహించాల్సిన పాత్ర, మరియు ఆ పాత్రను యేసు నెరవేర్చిన విధానమును గూర్చి యోచించుట, దేవుడు మనలో ఒకనివంటివాడు ఎందుకు అయ్యాడో అర్థం చేసుకోడానికి ఉత్తమమైన మార్గములలో ఒకటైయున్నది. ప్రత్యేకంగా ఈ పాత్రకు సంబంధించిన రెండు కోణాలు మన ప్రత్యేక ధ్యాసను కోరుతున్నాయి: మొదటిది, యేసు కడపటి ఆదామైయున్నాడనే వాస్తవం; రెండవది, యేసు మన యాజకుడు మరియు రాజైయున్నాడనే వాస్తవం.

ఆదాము మరియు క్రీస్తునకు మధ్య అపొస్తలుడైన పౌలు ఒక సమాంతరమును, ఒక సమరూపమును చూశాడనే వాస్తవం మనకందరికి సుపరిచితమే. ఈ సంబంధాన్ని పౌలు తన పత్రికలలో అనేక పర్యాయాలు పేర్కొన్నాడు. ఆదాము తెచ్చిన శాపమును క్రీస్తు తిరగరాశాడని ఒక్క మాటలో చెప్పుకొనవచ్చు; ఆదాము చేసిన పాపము మానవ జాతిని ఖండించింది, అయితే దేవుని పోలికగా మానవ జాతి వహించాల్సి ఉండిన పాత్రను యేసు విధేయత నెరవేర్చింది. దీనికి సంబంధించిన పౌలు దృష్టికోణం యొక్క అత్యంత సంక్షిప్తమైన అభివ్యక్తము 1 కొరింథీ 15:21-22లో కనబడుతుంది. పౌలు ఈ క్రింది మాటలు వ్రాస్తున్నాడు:

> మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు (1 కొరింథీ 15:21-22).

మనము ఆశించే దానికి ఈ మాటలు ఎంత తారతమ్యంగా ఉన్నాయో గమనించండి. “ఒక మనుష్యుని ద్వారా మరణం వచ్చింది, కాని మృతుల పునరుత్థానము దేవుని శక్తి ద్వారా కలుగుతుంది” అని పౌలు చెప్పవచ్చునని మనము ఆశించియుండవచ్చు. దానికి సంబంధించినంత మేరకు అది నిజమే, కాని పౌలు ఇచ్చట ఉద్ఘాటిస్తున్న ఉదంతం ఇది కాదు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

దానికి బదులుగా, మానవుల మరణం ఒక మనుష్యుని ద్వారా అనగా, ఆదాము ద్వారా కలిగింది గనుక, నిత్యజీవమునకైన మానవ జాతి యొక్క మృతుల పునరుత్థానము కూడా ఒక మనుష్యుని ద్వారానే అనగా, క్రీస్తు ద్వారానే కలుగవలసి యుండిందని పౌలు పలికాడు. ఆదాము దేవుని అవిశ్వసనీయమైన పోలికెయై యుండెను, కాబట్టి ఆయన ద్వారా మనకు మరణము ప్రాప్తించింది; కాని క్రీస్తు పరిపూర్ణంగా దేవుని విశ్వసనీయమైన పోలికెయై యుండెను, కాబట్టి ఆయన ద్వారా మనకు పునరుత్థాన జీవము ప్రాప్తించింది.

ఆదాము పాపము వలన కలిగిన శాపమును బట్టి క్రీస్తు ఆయన యందు విశ్వాసముంచు వారందరి కోసం ప్రత్యామ్నాయంగా మరణించాడు, కాబట్టి ఆయన తన నీతినిమిత్తము దేవుడిచ్చిన ప్రతిఫలము పొందాడు — ఈ ప్రతిఫలములో మరణముపై విజయము, మరియు సర్వ సృష్టిపై అధికారము కలిసియుండినవి. క్రొత్త నిబంధన తన దృష్టిని క్రీస్తు యొక్క మానవత్వముపై ఇంతగా కేంద్రీకరించడానికి ఇదొక కారణం. ఆయన కడపటి ఆదాము అనగా, ఆది నుండి మానవ జాతి చేయవలసి యుండిన సకలము చేసిన మానవుడు. ఆయన ప్రయాసముల ద్వారా దేవుని రాజ్యము యొక్క ఉద్దేశములు నెరవేరెను.

దేవుని పరిపూర్ణమైన పోలికెయై యుండుటతో పాటు, యాజకుడు మరియు రాజు యొక్క రాజ్యాధికారాలను కూడా క్రీస్తు నెరవేర్చుతున్నాడు. ఆదాము మరియు హవ్వ దేవుని యొక్క రాజులైన యాజక సమూహంగా ఆయనను సేవించారని, యాజకుల రాజ్యమై యుండుటకు దేవుడు ఇశ్రాయేలును పిలిచాడని, అధికారుల చేత అనగా, ఒక రాజు, మరియు ప్రధాన యాజకుడు నాయకత్వం వహించు అధికారపూర్వక యాజకత్వము చేత ఇశ్రాయేలు రాజ్యము నడిపింపబడునని, మనము జ్ఞాపకం చేసుకొనవచ్చు. క్రొత్త నిబంధన క్రీస్తును మన ప్రధాన యాజకునిగాను రాజుగాను చిత్రీకరిస్తున్నదని మనము కనుగొనున్నట్లయితే అది మనలను ఏమాత్రమును ఆశ్చర్యపరచనక్కర్లేదు. ఉదాహరణకు, క్రీస్తు యొక్క యాజకత్వ పాత్రను హెబ్రీ పత్రిక రచయిత పలుమార్లు నొక్కివక్కాణించాడు. హెబ్రీ. 4:14లో రచయిత ఇలా వ్రాస్తున్నాడు:

> ఆకాశమండలము గుండా వెళ్లిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధాన యాజకుడు మనకు ఉన్నాడు (హెబ్రీ. 4:14).

ఇంతేగాక, క్రొత్త నిబంధన యందంతటను క్రీస్తు, దావీదు యొక్క రాజత్వ పదవిని నెరవేర్చిన దావీదు కుమారునిగా ప్రస్తావించబడుతున్నాడు. వాస్తవానికి, క్రీస్తు జన్మమును గూర్చి మరియకు తెలుపబడినప్పుడు ఆయనను గూర్చి దేవదూత లూకా 1:32-33లో వ్రాయబడినట్లు, ఈ క్రింది విధంగా పలికాడు.

> ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును; ఆయన రాజ్యము అంతములేనిదై యుండునని ఆమెతో చెప్పెను (లూకా 1:32-33).



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

రాజ పదవిని క్రీస్తు పరిపూర్ణంగా నెరవేర్చుచున్నాడు, గనుక ఆయన నాయకత్వంలో దేవుని రాజ్యము ఎన్నటికిని అంతము కాదు. క్రీస్తు ఒక యాజకుడుగాను రాజుగాను చేపట్టు నాయకత్వం ద్వారా దేవుని రాజ్యము నిజముగా అది పరలోకమందున్నట్టు భూమి మీదకు వచ్చును.

నిస్సందేహంగా క్రొత్త నిబంధన యుగంలో, దేవుని రాజ్యములో క్రీస్తు అత్యంత ప్రాముఖ్యమైన వ్యక్తియై యున్నప్పటికిని, ఆయన అనుచరులు సహితం రాజ్యములో భాగమై యున్నారనే విషయాన్ని మనము చేర్చనట్లయితే, మనము పొరపాటు చేసినవారమవుదుము.

## విశ్వాసులు

క్రొత్త నిబంధన ఆదిలోనే, యూదులైన ప్రజలు అనగా, అబ్రాహాము యొక్క శారీరక వంశస్థులు, రాజ్యములో ఒక ప్రత్యేకమైన పాత్రను నిర్వహించారు. యేసు మరియు ఆయన అపొస్తలులు మాత్రమే కాదు, కాని పెంతెకొస్తు దినాన కూడికొని యుండిన ఆది సంఘం మొత్తం యూదులై యుండిరి. ఆ దినాన, వారు సువార్త విని విశ్వసించునట్లు, దేవుడు ఇశ్రాయేలులోని విశ్వసనీయమైన శేషమును సర్వలోకములో నుండి సమావేశపరచాడు.

ఆ తరువాత, దేవుని రాజ్యము ఇశ్రాయేలు సరిహద్దులను మించి రోమా సామ్రాజ్యమందంతటను నలుదిశల్లో వేగంగా విస్తరించింది. క్రీస్తునంగీకరించిన ఇతర దేశస్తులలో అనేకులు అన్యజనులై యుండినప్పటికిని, క్రీస్తు ననుసరించి ప్రతి ఒక్కరు, వారు యూదులైనా లేదా అన్యజనులైనా, దేవుని ప్రజలతో కూడా లెక్కింపబడి దేవుని రాజ్యమును నిర్మించు పాత్ర అనుగ్రహింపబడుదురని క్రొత్త నిబంధన తెలుపుతున్నది. అందుచేతనే క్రొత్త నిబంధన క్రీస్తు అనుచరులు దేవుని వినూత్నపరచబడిన పోలికెలై యున్నారని వారి గూర్చి చెప్పుతున్నది. మనము ఏమైయున్నామో, పౌలు ఎఫెసీ. 4:24లో ఈ క్రింది విధంగా వివరిస్తున్నాడు:

> నీతి మరియు పరిశుద్ధత విషయంలో యథార్థమైన భక్తిగలవారమై దేవుని పోలికెగా సృష్టింపబడిన నూతన స్వభావమును ధరించుకొనవలెను.

పాత నిబంధన ఇశ్రాయేలు వహించిన పాత్రకు సంబంధించినంత వరకు యూదులు మరియు అన్యజనులు చేరియుండిన క్రొత్త నిబంధాన సంఘాన్ని పేతురు వర్ణించడానికి ఇది కూడా ఒక హేతువే. 1 పేతురు 2:9లో పేతురు ఈ క్రింది విధంగా వ్రాస్తున్నాడు:

> అయితే మీరు చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచిన వాని గుణాతిశయములను ప్రచురముచేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును,



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు (1 పేతురు 2:9).

నిర్గమ 19:6లో ఇశ్రాయేలు, యాజకులైన రాజ్యము అని పిలువబడిన విషయాన్ని పేతురు పరోక్షంగా సూచించాడు. పాత నిబంధన ఇశ్రాయేలును గూర్చిన లక్ష్యములో పాలుపొందడానికి భూమి మీద నున్న ప్రతి జాతికి చెందిన క్రైస్తవులు పిలువబడి యున్నారనే విషయాన్ని పేతురు పరోక్షమైన ఈ ప్రస్తావన ద్వారా విదితం గావిస్తున్నాడు, ఆ లక్ష్యమేమనగా దేవుని రాజ్యము భూమి మీద స్థాపింపబడి విస్తరింపబడవలెను. మనము క్రీస్తును అనుసరిస్తూ ఆయన ఆత్మ అనుగ్రహించు శక్తితో జీవించునప్పుడు, మనమందరము దేవుని రాజ్యము యొక్క ప్రత్యేకమైన, ఏర్పరచుకొనబడిన సాధనములమై యుంటాము.

క్రొత్త నిబంధన యుగములోని దేవుని రాజ్యమునకు సంబంధించిన స్థలము మరియు ప్రజలు అనే రెండు విషయాలు మనము తెలుసుకొన్నాము, గనుక మన దృష్టిని ఇక చివరి అంశముపై కేంద్రీకరిద్దాము: క్రొత్త నిబంధనలో రాజ్యము యొక్క పురోభివృద్ధి.

## పురోభివృద్ధి

అనేక విధాలుగా, క్రొత్త నిబంధనలోని దేవుని రాజ్యము యొక్క పురోభివృద్ధి మనము లేఖనములలో కనుగొను అత్యంత సమగ్రమైన భావనలలో ఒకటైయున్నది. మనము తరువాత పాఠములలో నేర్చుకొనబోతున్నట్టుగా, పాత నిబంధన ప్రవక్తలను గూర్చి మనము చదువునప్పుడు, క్రీస్తు భూమి మీదికి వచ్చాడంటే దేవుని రాజ్యము వేగంగా వస్తుందనే అభిప్రాయమును ఏర్పరచుకొనుట సులభమవుతుంది. దుష్టత్వము భూమి మీద నుండి అకస్మాత్తుగా నిర్మూలింపబడుతుంది, మరియు దేవుని మహిమాన్వితమైన సన్నిధితో భూమి నింపబడుతుంది, లెక్కింపబడజాలనంత మంది దేవుని ప్రజలు భూమిని నింపుదురు, నిరంతరము ఆయననే సేవిస్తూ ఆరాధించుదురు. వాస్తవానికి, యేసు కాలములో నివసించిన ప్రజలలో ఎక్కువ మంది కూడా ఇలాగే జరుగుతుందని ఎదురుచూశారు. కాని ఇశ్రాయేలులో ఎక్కువ మంది ఆయనను వారి మెస్సీయగా అనుసరించుటకు బదులుగా ఆయనను తృణీకరించునంతగా, యేసు ఈ ఎదురుచూపును బహు బలంగా సవాలుచేశాడు.

ఆవగింజను గూర్చి యేసు చెప్పిన ఉపమానము ద్వారా క్రోడీకరించుట, క్రొత్త నిబంధనలోని రాజ్యము యొక్క పురోభివృద్ధిని క్రోడీకరించడానికి ఉత్తమమైన మార్గములలో ఒకటైయున్నది. దేవుని రాజ్యమును గూర్చి యేసు సెలవిచ్చిన వివరము మత్తయి 13:31-32లో ఈ క్రింది విధంగా వ్రాయబడియున్నది:

> ఆయన మరియొక ఉపమానము వారితో చెప్పెను పరలోకరాజ్యము, ఒకడు తీసికొని తన పొలములో విత్తిన ఆవగింజను పోలియున్నది. అది విత్తనములన్నిటిలో

> చిన్నదేగాని పెరిగినప్పుడు కూర మొక్కలన్నిటిలో పెద్దదై ఆకాశపక్షులు వచ్చి దాని కొమ్మలయందు నివసించునంత చెట్టగును (మత్తయి 13:31-32).

ఈ చిన్న ఉపమానములో, దేవుని రాజ్యము ఆకస్మాత్తుగాను మరియు ఒక విపత్తుగాను వచ్చుటకు బదులుగా అది ఒక చిన్న ఆవగింజ వలె ఆరంభమవుతుందని యేసు వివరించాడు, కాని అది పరిపక్వత చెంది ఆవగింజ చెట్టైయుండునట్లు సరైన సమయంలో ఆ రాజ్యము ఎదుగుతుంది, అది లోకము ఎప్పుడైనాగాని ఎరిగిన దాని కంటె విస్తారమైనదై యుంటుంది.

మిగతా క్రొత్త నిబంధన మనకు తెలియజేయుచున్నట్లు, రాజ్యము యొక్క క్రొత్త నిబంధన దశ యేసు ఈ లోకంలో చేసిన పరిచర్యతో అది ఉండినంతలోనే చిన్నదిగాను నిమ్మళంగాను ఆరంభమయ్యింది. కాని ముగింపులో, క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు, ఆయన రాజ్యము భూదిగంతముల వరకు విస్తరించి యుంటుంది. ఈ పాఠముల పరంపరల యందంతటను, క్రొత్త నిబంధన యుగములోనే దేవుని రాజ్యము యొక్క పురోభివృద్ధిని గూర్చి మనము పదే పదే ముఖ్యమైన మూడు దశలుగా చెప్పుకొనుచుందుము.

## ప్రారంభోత్సవము

మొదటిది, క్రీస్తు మరియు ఆయన అపొస్తలులు పరిచర్యలో రాజ్యము యొక్క ఆరంభము లేదా ప్రారంభోత్సవమును గూర్చి తెలుసుకొంటాము. రెండు వేల కంటె ఎక్కువైన సంవత్సరముల క్రితం, యేసు మరియు ఆయన అపొస్తలులు భూమి మీద దేవుని మహిమాన్వితమైన రాజ్యము యొక్క ప్రారంభోత్సవమును చేశారు. అందుచేతనే సంఘము ఏమైయున్నదో అపొస్తలుడైన పౌలు ఎఫెసీ. 2:20లో ఈ క్రింది విధంగా సెలవిస్తున్నాడు:

> క్రీస్తుయేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాదిమీద మీరు కట్టబడియున్నారు (ఎఫెసీ. 2:20).

## కొనసాగింపు

రెండవదిగా, రాజ్యము యొక్క కొనసాగింపును గూర్చి మనము నేర్చుకొంటాము, మరియు ఇది యేసు యొక్క మొదటి మరియు రెండవ రాకడ మధ్యకాలంలోని సంఘ చరిత్ర యందంతటను కొనసాగుచునే ఉంటుంది. ఇది నీవూ నేను జీవిస్తున్న కాలము. మనము దేవుని చిత్తమును నెరవేర్చుట ద్వారా దేవుని రాజ్యము వచ్చునట్లు అత్యంత ప్రాధాన్యతను ఇవాల్సింది ఈ కాలములోనే, మరియు ఇదే విషయాన్ని యేసు మత్తయి 6:33లో ఈ క్రింది విధంగా సెలవిస్తున్నాడు:

> ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి (మత్తయి 6:33).

మన జీవితములోని ప్రతి రోజు మనము క్రీస్తు రాజ్యము నిమిత్తమై సువార్తను విస్తరింపజేయాలి, మరియు సంఘమును బలంగా కట్టాలి, మరియు సర్వలోకంలోని సంస్కృతులను మార్చివేయాలి.

### లక్ష్యసిద్ధి

మూడవదిగా, రాజ్యము యొక్క అంత్య లక్ష్యసిద్ధిని గూర్చి, క్రీస్తు తిరిగి వచ్చి లోకమంతటిని ఆయన రాజ్యముగా మార్చివేయు దేవుని ప్రణాళికను నెరవేర్చు సమయమును గూర్చి మనము తెలుసుకొంటాము.

క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు దేవుని రాజ్యము ఎలా ఉంటుందో అని ప్రకటన 11:15 వచనములో యోహాను ఈ క్రింది విధంగా వర్ణిస్తున్నాడు:

> ఏడవ దూత బూర ఊదినప్పుడు పరలోకములో గొప్ప శబ్దములు పుట్టెను. ఆ శబ్దములు ఈ లోక రాజ్యము మన ప్రభువు రాజ్యమును ఆయన క్రీస్తు రాజ్యము నాయెను; ఆయన యుగయుగముల వరకు ఏలుననెను (ప్రకటన 11:15).

యేసు భూమి మీదికి తిరిగివచ్చినప్పుడు, లోకములోని రాజ్యం మొత్తం నిరంతరమునకు దేవుని మరియు క్రీస్తు రాజ్యమవుతుంది.

ఈనాడు జీవిస్తున్న క్రీస్తు అనుచరులముగా, రెండు వేల సంవత్సరముల క్రితం మన ప్రభువు చేపట్టిన ప్రారంభోత్సవ కార్యమును మనము జ్ఞాపకం చేసుకొనుచున్నాము. రాజ్యము కొనసాగుతున్న తరుణంలో ఈనాడు మనము ఆయన రాజ్యమును విస్తరింపజేస్తున్నాము, దేవుని రాజ్యమును క్రీస్తు అది పరలోకమందున్నట్టుగా భూమి మీదికి తీసికొనవచ్చు ఆ దినము కొరకు మనము ప్రార్థిస్తున్నాము, పని చేస్తున్నాము, నిరీక్షిస్తున్నాము. ఇది ఆనాడు పాత నిబంధన విశ్వాసము విషయంలో ఉండినట్లే, ఈనాడు మన క్రైస్తవ విశ్వాసము యొక్క ప్రధానాంశమైయున్నది. పాత నిబంధనలో దేవుని రాజ్యమును గూర్చిన నిరీక్షణలన్నియు వాటి నెరవేర్పును క్రీస్తునందు ఈ మూడు దశలలో అనగా, దేవుని రాజ్యము యొక్క ప్రారంభోత్సవము, కొనసాగింపు మరియు అంత్య లక్ష్యసిద్ధిలో కనుగొనుచున్నవి.

## ముగింపు

---

ఈ పాఠంలో దేవుని రాజ్యమును గూర్చిన ముఖ్యమైన బైబిలు నేపథ్యమును, పాత నిబంధన యొక్క బృహత్ వివరమును మొత్తమును అవగాహన చేసుకోడానికి అనువుగానున్న ఉత్తమమైన మార్గములలో ఒకదానిగా మేము ప్రవేశపెట్టాము. దేవుడు తన పరలోక పరిపాలన భూమి మీదికి వచ్చుటను గూర్చి

ఆదియందే ప్రణాళిక వేశాడని మనము తెలుసుకొన్నాము. దేవుడు ఈ లక్ష్యసిద్ధి దిశగా ప్రాచీనకాల చరిత్రలో, ఇశ్రాయేలు చరిత్రలో, మరియు క్రొత్త నిబంధన యుగములో ముందుకు సాగిన విధానమును మనము చూశాము. పాత నిబంధనను గూర్చిన మన అవలోకనము విషయంలో మనము ముందు సాగుతుండగా, రాజ్యమును గూర్చిన ఈ ముఖ్య నేపథ్యాన్ని పదే పదే చూస్తాము, ఎందుకనగా అది పాత నిబంధన అంతటిలో అతి ముఖ్యమైన సమగ్రమైన మరియు ఏకీకృతముచేయు ప్రధాన నేపథ్యమైయున్నది. మనము ఇలా చేసినప్పుడు, ఈనాడు సహితం రాజుల రాజు మరియు ఆయన రాజ్యము కొరకు జీవించడానికి మనము పాత నిబంధనను మార్గదర్శకముగా సద్వినియోగం చేసుకోడానికి క్రొత్త నిబంధన విశ్వాసులమైన మనకు అదొక తరుణమునిస్తుంది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.